ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 15 డిసెంబరు 2024



ఆన్‌లైన్‌లో బుకింగ్ సౌకర్యం

పాపికొండలు, భద్రాచలం, దిండి వెళ్లడానికి ఆన్‌లైన్‌లో కూడా టికెట్లు అందుబాటులో ఉంటాయి. రాజమహేంద్రవరంలోని టూరిజం కార్యాలయాల్లో టికెట్లు బుక్ చేసుకోవచ్చు.98486 29341, 99519 68200, 98488 83091 నెంబర్లలో సంప్రదించి మరిన్ని వివరాలను తెలుసుకోవడంతోపాటు టికెట్లు కొనుగోలు చేయవచ్చు. లోకల్ రైడింగ్‌కి అక్కడికక్కడే టికెట్లు ఇస్తారు. టూర్ ఆపరేటర్ల ద్వారా కూడా టికెట్లు కొనుగోలు చేయవచ్చు. దిండి రిసార్ట్సుకు ఆన్‌లైన్ సదుపాయం అందుబాటులో ఉంది. ఆన్‌లైన్‌లోనే టిక్కెట్లు, రూమ్‌లు బుక్ చేసుకోవచ్చు.

83 సాగునీటి సంఘాల ఏర్పాటు

- అన్నిచోట్లా ప్రశాంతంగా ఎన్నికలు
- కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 83 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఏర్పాటయ్యాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శనివారం తెలిపారు. జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో పూర్తి అయ్యాయన్నారు. గోదావరి మధ్య డెల్టా, తూర్పు డెల్టాలో మొత్తం 990 ప్రాదేశిక నియోజకవర్గాలకు గాను ఏడు నియోజకవర్గాల్లో ఓటర్లు లేని కారణంగా ఎన్నికలు నిర్వహించలేదన్నారు. మిగిలిన 983 ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించామన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తి కావడంతో రైతులకు గతంలో మాదిరిగా సకాలంలో సాగునీరు అందించే పర్యవేక్షణ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందన్నారు. సాగునీటి సరఫరా, కాల్వల నిర్వహణ ప్రక్రియ సజావుగా జరిగి శివారు ప్రాంత భూములకు సైతం సాగునీరు అందించేలా పర్యవేక్షణ చేసేందుకు సాగునీటి సంఘాలు దోహదపడతాయన్నారు. ఒక్కో సంఘం నుంచి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకునే ప్రక్రియ కూడా పూర్తి అయిందన్నారు. రైతు సంక్షేమమే పరమావధిగా ప్రతీ నీటిబొట్టును ఒడిసిపట్టి శివారు ప్రాంతాలకు సైతం సాగునీటి సజావుగా పారే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సంఘాల వ్యవస్థను పునరుద్ధరించిందని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 17న డిస్ట్రిబ్యూషన్ కమిటీకి ఎన్నిక నిర్వహిస్తామన్నారు.

భవిష్యత్ తరాలకు ఇంధన వనరులపై
భరోసా కల్పించాలి



ఇంధన పొదుపు వారోత్సవ పోస్టర్లను ఆవిష్కరించిన జేసీ నిషాంతి

- ప్రతిఒక్కరూ ఇంధనాన్ని పొదుపుగా వాడాలి
- జాయింట్ కలెక్టర్ నిషాంతి


అమలాపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు ఇంధన వనరులపై భరోసాను కల్పించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. విద్యుత్ పొదుపు ప్రగతికి మలుపు అని విద్యుత్‌ను ఆదా చేయడం వల్ల ఎంతో మేలు చేకూరుతుందని ఆమె చెప్పారు. కలెక్టరేట్ నుంచి అమలాపురం గడియార స్తంభం సెంటర్ వరకు శనివారం నిర్వహించిన ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీని జేసీ జెండా ఊపి ప్రారంభించారు. ప్రతీ ఒక్కరూ ఇంధనాన్ని పొదుపుగా వాడాలని నినాదాలు చేస్తూ ట్రాన్స్‌కో సిబ్బంది ర్యాలీలో ముందుకు సాగారు. ఈ సందర్భంగా జేసీ నిషాంతి మాట్లాడుతూ సహజ వనరులను భవిష్యత్తు తరాలకు అందించేందుకు ప్రతీ ఒక్కరూ సమష్టిగా ఇంధన పొదుపును పాటించాలని స్పష్టం చేశారు. పొదుపు ప్రాముఖ్యాన్ని వివరిస్తూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ఇంధన పొదుపు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మూడు నక్షత్రాల నుంచి ఐదు నక్షత్రాల రేటింగ్ కలిగిన విద్యుత్ గృహోపకరణాలు వినియోగించడం ద్వారా 30 శాతం విద్యుత్‌ను ఆదా చేయవచ్చునన్నారు. ప్రతీ ఏటా డిసెంబరు 14న జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం నిర్వహిస్తారన్నారు. ఇంధన వృథాను అరికట్టడంపై అవగాహన పెంపొందించడమే ఇంధన పొదుపు దినోత్సవ ప్రధాన లక్ష్యమన్నారు. ఇష్టారాజ్యంగా ఇంధన వనరులను వినియోగించడం వల్ల భవిష్యత్తు అవసరాలకు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. అవసరాలకు మించి ఇంధనాన్ని వినియోగిస్తూ పొదుపుపై అదుపు లేకుంటే భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. అందుకే సంప్రదాయేతర ఇంధన వినియోగం ప్రత్యామ్నాయ మార్గంగా ఎంపిక చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని జేసీ తెలిపారు. ట్రాన్స్‌కో ఎస్ఈ ఎస్.రాజబాబు మాట్లాడుతూ ఇంధన వనరుల రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత కావాలన్నారు. జనాభా పెరుగుదలతో పాటు ఇంధన వనరుల వినియోగం విపరీతంగా పెరుగుతుందన్నారు. సంప్రదాయేతర ఇంధన వనరులైన సౌర, పవన విద్యుత్ వనరులపై ఆధారపడాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్‌కు బదులు బయో ఇంధన వనరులను, బయో డీజిల్, బయో గ్యాస్ వంటి వనరులపై ఆధారపడడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారం అవుతామన్నారు.విద్యుత్ శాఖ డీఈలు రవికుమార్, పుల్లయ్య, ఏఈ రవికుమార్, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.



ఈ భవనానికి 75 గుమ్మాలు 6లో


ఆదివారం ప్రత్యేకం

అలా చూసొద్దాం!



గోదారి విహారం.. ఆనందం..ఆహ్లాదం

- గోదారిలో ఎన్నెన్నో అందాలు
- పర్యాటకులకు స్వర్గధామం
- పాపికొండలు చూస్తే మరువలేం
- దిండి వెళితే.. వదిలి రాలేం
- ప్రకృతి ఊరు..చింతూరు



గోదావరిలో పాపికొండల మధ్య నుంచి వెలుతున్న బోటు

వీకెండ్ సంస్కృతి గోదావరి జిల్లాలకు వచ్చేసింది.. శనివారం వస్తుందంటే చాలు. కుటుంబంతో హాయిగా ఎక్కడికో చోటకు ఎగిరిపోవాలి.. ఆదివారమంతా ఆనందంగా గడపాలి.. ప్రతి నెలా చాలామందికి ఇదో పెద్ద టాస్క్. ఇదో క్వశ్చన్ మార్క్? ఎందుకంటే మన దగ్గర ఏ ప్రాంతాలు ఉన్నాయి.. ఎలా వెళ్లాలి..? చుట్టూ ఉన్న అందం.. ఆహ్లాదం గురించి చాలామందికి అవగాహనే లేదు. ఒకసారి గోదావరిలో విహరించామంటే ఆ ఆనందమే వేరు.. కుటుంబంతో హాయిగా గడపొచ్చు.. కొత్త అనుభూతిని పొందొచ్చు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

చుట్టూ కొండల మధ్య గోదారి అందాలను ఆస్వాదించి.. పేరంటాలపల్లిలో శివుడిని చూసి.. భద్రాచలం రాములోరి దర్శనం చేసుకుని.. ఇలా ప్రయాణం సాగిస్తే.. ఆ ఆనందం.. ఆ అనుభూతే వేరు.. ఇక కోనసీమలోని దిండి రిసార్ట్స్.. చింతూరు వెళ్లామా మూడు నదుల సంగమం చూసిరావొచ్చు.. ఒకసారి చూసి వచ్చామా.. మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తాయి.. మనసుకు అంత ఆహ్లాదం.. ఆనందాన్ని అందిస్తాయి.. అంత దూరం వెళ్లలేమా గోదావరిలో లోకల్ బోటింగ్ ఆహ్వానం పలుకుతోంది. లాహిరి లాహిరి లాహిరిలో అంటూ ఈ వీకెండ్ ఒకసారి అలా వెళ్లి.. మన గోదావరిని చూసొద్దాం.. మరో లోకంలో విహరించి వద్దాం..కుటుంబంతో కలిసిన మధుర స్మృతులను జ్ఞాపకంగా మలుచుకుందాం.



లోకల్ అందాలకూ బోట్లు

రాజమహేంద్రవరంలో లోకల్ అందాలను తిలకించడానికి టూరిజంశాఖ ఐదు బోట్లను నడుపుతోంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం చీకటిపడే వరకూ వీటిని అందుబాటులో ఉంచుతున్నారు. రోడ్ కం రైలు బ్రిడ్జి నుంచి పాత వంతెన వరకూ 20 నిమిషాల పాటు హాయిగా సోయగాలను తిలకించవచ్చు. మేజు వాణి, చిత్రాంగి, ఫాంటూన్ బోట్లకు పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.50, ధరణిలో పెద్దలకు రూ.150, పిల్లలకు రూ.120 రుసుం నిర్ణయించారు. ఫాంటూన్ బోటు పుష్కరఘాట్ నుంచి, మిగతా మూడూ మార్కండేయస్వామి సమీపంలో ఉన్న పర్యాటకశాఖ జలవిహార నియంత్రణ కేంద్రం నుంచి ఆపరేట్ చేస్తున్నారు. స్పీడు బోటులో రూ.500 చెల్లించి ఓ పది నిమిషాల పాటు రైడ్ చేయొచ్చు. ఈ స్పీడు బోటుకు డిమాండ్ ఉంది. ఆదివారాల్లో రద్దీగా ఉంటుంది.

పాపికొండల నడుమ..

పాపికొండలు రమణీయమైన ప్రదేశం. ఒక రోజు టూర్ ప్యాకేజీ. రాజమహేంద్రవరం టూరిజం కార్యాలయం వద్దకు ఉదయం 7 గంటలకు చేరుకుంటే ప్రత్యేక వాహనంలో గండి పోచమ్మ ఆలయం వరకూ తీసుకెళతారు. అక్కడి నుంచి పాపికొండలకు బోట్లు బయలుదేరతాయి. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ అందజేస్తారు. ఎంటర్‌టైన్ మెంట్‌కి కొదవ ఉండదు. జాలీగా సాగిపోతుంది. పేరంటాలపల్లి వద్ద కాసేపు హాల్ట్‌లో శివుడిని దర్శించుకోవచ్చు. సాయంత్రం 5 గంటలకు గండి పోచమ్మ ఆలయానికి చేరుకుని అక్కడి నుంచి వాహనాల్లో 7 గంటలకు రాజమహేంద్రవరం తిరిగి వస్తారు. ఈ ప్రయాణానికి పెద్దలకు రూ.1250, పిల్లలకు రూ.1050. గండిపోచమ్మ ఆలయం వద్ద ఉండే బోటు దగ్గరకు నేరుగా వస్తామంటే పెద్దలకు రూ.వెయ్యి, పిల్లలకు రూ.800 చెల్లిస్తే సరిపోతుంది.

భద్రాచలం ఇలా వెళ్లొచ్చు..

పాపికొండలకు వెళ్లినట్టే రాజమహేంద్రవరం నుంచి పేరంటాలపల్లి వరకూ బోటులో వెళతారు. అక్కడ వేరే బోటు ద్వారా సాయంత్రం 4 గంటలకు భద్రాచలం చేరుకుంటారు. ఒకవైపు ప్రయాణానికి రూ.2500. తిరుగు ప్రయాణంలో బోటులో రావాలంటే మరో రూ.2500 చెల్లించి మరుసటి రోజు ఉదయం బయలుదేరే బోటులో రావొచ్చు.



చింతూరు నుంచి బోటు షికారు

ప్రకృతి సోయగాల టూరు ..చింతూరు

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

అది మూడు రాష్ట్రాల ముఖద్వారం.. మూడు నదుల సంగమం.. జలపాతాల సోయగం.. పాపికొండల విహారం చింతూరు డివిజన్‌కే సొంతం. ప్రకృతి ఆరాధకులకు ఇదో ముచ్చటైన ప్రదేశం. హిందీ, ఒడియా, ఆదివాసీ, తెలుగు భాషల కలయిక ఇక్కడ మనం వినవచ్చు. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే శబరి, ఒడిశా నుంచి వచ్చే సీలేరు నదులు చింతూరు మండల శివారు గ్రామమైన కల్లేరు వద్ద సంగమమవుతుంటాయి. అక్కడి నుంచి మరో 18 కిలోమీటర్ల దూరం పయనించి కూనవరం వద్ద గోదావరి ప్రవాహంలో ఈ రెండు నదులు కలుస్తుంటాయి. చింతూరుకు 8 కిలోమీటర్ల దూరంలో ఒడిశా, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల ప్రవేశాలను చూడొచ్చు. మోతుగూడెం వద్ద పొల్లూరు జలపాతాలు, చింతూరు, మారేడుమిల్లి నడుమ సోకిలేరు వ్యూ పాయింట్ అబ్బురపరుస్తుంటాయి. వరరామచంద్రపురం నుంచి బోట్లపై పాపికొండల విహారయాత్రతో పులకరించవచ్చు. మోతుగూడెంలో 460 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన కేంద్రానికి చెందిన నీటి కాల్వలు, రిజర్వాయర్ చూడముచ్చట గొలుపుతాయి. చింతూరు నుంచి 30 కిలోమీటర్ల దూరంలో కూనవరం వద్ద మూడు నదుల సంగమం చూడవచ్చు. అక్కడి నుంచి 22 కిలోమీటర్లు ప్రయాణిస్తే పోచవరం వస్తుంది. అక్కడి నుంచి 20 కిలోమీటర్ల దూరం బోటుపై ప్రయాణించి పాపికొండలు చేరుకోవచ్చు. పోచవరం నుంచి పాపికొండలకు ఒక్కొక్కరికి బోటు ఛార్జి రూ.1000 వంతున చెల్లించాలి. ఈ ఛార్జిలోనే భోజనం, టీ, టిఫిన్, స్నాక్స్ బోటులోనే సమకూరుస్తారు.

దిండి వెళితే.. మరచిపోలేమండి..

(అమలాపురం- ఆంధ్రజ్యోతి)

గలగలపారుతున్న గోదావరిలో పడవ ప్రయాణం ఓ మధురానుభూతి. కోనసీమ జిల్లాలోని వశిష్ఠ నది చెంతన మలికిపురం మండలం దిండిలో కేరళ తరహా హౌస్‌బోట్లలో నదీ విహారం చేయొచ్చు. దిండి రిసార్ట్స్‌లో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన వసతి గదులతోపాటు హౌస్‌బోట్లు, వశిష్ఠ బోటు, స్పీడు బోట్లు ఉన్నాయి. ఇక్కడ గంటల వారీ ప్యాకేజీలు అమలవుతాయి. వైనతేయ నదీపాయ పేరుతో హౌస్‌బోటులో ప్రత్యేక హంగులతో పర్యాటకులకు నదీ విహారం చేయనుంది. గోదావరి, వశిష్ఠ, ఆత్రేయ పేర్లతో బోట్లు ఉన్నాయి. హౌస్‌బోటులో నలుగురు పెద్దవారు, నలుగురు పిల్లలకు ప్యాకేజీ రూ.15 వేలు. గోదావరి బోటులో 20 మంది, వశిష్ఠ బోటులో 20 మంది, ఆత్రేయ బోటులో పదిమంది పర్యాటకులు ఉంటే నదీ విహారానికి బయలుదేరతాయి. వీటిని ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. ఈ బోట్ ప్యాకేజీ కోసం దిండి రిసార్ట్స్ సెల్ నెంబరు 98487 80524లో సంప్రదించవచ్చు. దిండిలో మరో మూడు ప్రైవేటు రిసార్ట్స్ ఉన్నాయి. సోంపల్లిలో కోనసీమ రిసార్ట్స్, ఓడలరేవులో సముద్ర రిసార్ట్స్, అయినవిల్లిలో విల్లా రిసార్ట్స్, పాశర్లపూడి, యానాం పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు రిసార్ట్స్ ఉన్నాయి.



దిండి విహారానికి ఫ్యామిలీ బోట్..

బోటింగ్ సాగుతుందిలా..

యానాం నుంచి సావేరీ బోటు ద్వారా సాగర సంగమ విహారం, బోడసకుర్రు, పాశర్లపూడి, ఆదుర్రు, సోంపల్లి, అంతర్వేది, సఖినేటిపల్లి, ఎదుర్లంక, దిండితో వివిధ నదీ పరివాహక ప్రాంతాల్లో బోటు షికార్లకు ఏర్పాటు చేశారు. వీటితోపాటు కాట్రేనికోన మండలం కందికుప్ప, తాళ్లరేవు మండలం కోరంగి నుంచి మడ అడవుల్లో పడవల ద్వారా విహారయాత్ర సాగించడానికి అటవీశాఖ ఏర్పాట్లు చేసింది.



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

లోక్ అదాలత్‌లో పలు కేసుల పరిష్కారం

అమలాపురం టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అమలాపురం రెండో అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ ఆధ్వర్యంలో మూడు కోర్టుల్లో లోక్ అదాలత్ జరిగింది. రాత్రి 8 గంటల సమయానికి 221 కేసులు పరిష్కారం కాగా మరో కోర్టులో ఎక్సైజ్ కేసులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటివరకు రూ.18.08 కోట్లకు సంబంధించిన కేసులను పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి, ఏడీఎం ఎ.హిమబిందులతో కలిసి నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో సభ్యులు కళా వెంకట్రావు, వీకేఎస్ భాస్కరశాస్త్రి, జల్లి దుర్గామహాలక్ష్మి, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.



రేపు మోగనున్న నెలగంట 6లో



అంబాజీపేట మండలం ఇరుసుమండలో సిద్ధమైన నారుమడి

ఖరీఫ్ చివరిలో తుఫాన్ చేసిన నష్టం నుంచి కోలుకుంటున్న రైతులు ధైర్యాన్ని కూడగట్టుకుని కొండంత ఆశతో దాళ్వా సాగుకు సమాయత్తమవుతున్నారు. గోదావరి డెల్టా పరిధిలోని రైతులు రబీ సాగును ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాలలో 1.87 లక్షల ఎకరాలలో రబీ సాగు చేపట్టనున్నారు.

ధైర్యాన్ని కూడగట్టుకుని..
రబీకి సిద్ధమైన అన్నదాతలు



ముక్కామలలో ధాన్యాన్ని ఎండబెడుతున్న కూలీలు

అంబాజీపేట, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి):తుఫాన్లు, వర్షాల కారణంగా ఖరీఫ్ సాగు ఆలస్యం కావడంతో జిల్లాలో మందకొడిగా నారుమడులు సాగుతున్నాయి. ఖరీఫ్‌లో 1.57 లక్షల ఎకరాలలో సాగు చేపట్టగా ప్రస్తుతం 1.34 లక్షల ఎకరాలలో వరికోతలు పూర్తైనట్లు అధికారులు ధ్రువీకరించారు. ఇప్పటి వరకూ 1.85 మెట్రిక్ టన్నులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేపట్టారు. ఖరీఫ్ సాగును పూర్తిచేసిన అన్నదాతలు రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే మండపేట, ఆలమూరు, కె.గంగవరం, రామచంద్రపురం, కపిలేశ్వరపురం, రాయవరం తదితర మండలాలలో సుమారు 140 ఎకరాలలో వెదజల్లు విధానం ద్వారా రబీని ప్రారంభించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 130 ఎకరాలకు పైగా నారుమడులను సిద్ధం చేసుకున్నారు. ఈ నెలాఖరు నాటికి వరినాట్లు పూర్తిచేసేలా రైతులు కృషి చేయాలన్నారు. రబీ ఆలస్యంగా ప్రారంభించడంతో చిరుపొట్ట దశకు వచ్చేసరికి సాగునీటి ఎద్దడి వచ్చే కారణంగా రైతులు ముందస్తుగా రబీ సాగును ప్రారంభించాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే పొలం పిలుస్తోంది కార్యక్రమాల ద్వారా విత్తనోత్పత్తి, ఎరువుల యాజమాన్యం, విత్తన ఎంపిక, మొలకెత్తడం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. 120 రోజుల సాగు అయ్యే 1121 వంగడాన్ని సాగు చేయాలని అధికారులు సిఫార్సు చేస్తున్నారు. వరి తెగుళ్ల తట్టుకునే విధంగా ఈ వంగడాన్ని రూపొందించారన్నారు. వీటికి మంచి ధర పలుకుతుండటంతో రైతులు 1121 వరి వంగడంపై ఆసక్తి చూపుతున్నారు.

నాట్లు వేగవంతమవ్వాలి

రబీ సాగు ఆలస్యం కావడంతో రైతులు ఈ నెలాఖరు నాటికి వరినాట్లు పూర్తిచేసేలా అవగాహన కల్పిస్తున్నాం. సాగు ఆలస్యంగా చేపట్టే రైతులకు వెదజల్లే విధానాన్ని సిఫార్సు చేయాలని ఆదేశించాం. విత్తన ఎంపికలో నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకుని రబీ సాగు చేపట్టాలి. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో ముందస్తుగా రబీని ప్రారంభించుకోవాలి


వి. బోసుబాబు,
జిల్లా వ్యవసాయాధికారి,



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

'అప్పనపల్లి' కిటకిట
అధిక సంఖ్యలో భక్తుల రాక

మామిడికుదురు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున అర్చకులు వేదమంత్రోచ్చరణల నడుమ సుప్రభాత సేవ నిర్వహించి తొలి హారతి ఇచ్చారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యాభిషేకాలు, లక్ష్మీనారాయణ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులతో కొత్త, పాత ఆలయాలు కిటకిటలాడాయి. శనివారం వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,78,287 ఆదాయంగా వచ్చిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బంది తలెత్తకుండా సహాయ కమిషనర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



తొలిహారతి ఇస్తున్న అర్చకులు

ఓఎన్జీసీ గేటు వద్ద గ్రామస్థుల ధర్నా
ఎమ్మెల్యే జోక్యంతో ఆందోళన విరమణ

అల్లవరం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కృష్ణాగోదావరి బెసిన్ పరిధిలో సుమారు 30 ఏళ్లుగా చమురు ఉత్పత్తులు తరలిస్తున్న ఓఎన్జీసీ ఓడలరేవులో స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదని ప్రమోటక్ మెయింటెన్స్ కంపెనీలు ఇతరులకు ఉద్యోగాలు ఇస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ గ్రామస్థులు ఆందోళనకు దిగారు. అల్లవరం మండలం ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ గేటు వద్ద ఉదయం 7.30 నుంచి సాయంత్రం వరకూ బైఠాయించి నిరసన తెలిపారు. కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు, కొప్పాడి రామకృష్ణారావు, కలిగితి సత్యనారాయణ, మందపాటి రామకృష్ణ, గుబ్బల శ్రీను, పెచ్చెట్టి రామకృష్ణ, రేకాడి లోవరాజుతో పాటు గ్రామస్థులు తొమ్మిదిన్నర గంటల పాటు బైఠాయించి ఆందోళన చేశారు. అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జోక్యంతో ఓఎన్జీసీ అధికారులతో ఎస్ఐ హరీష్ గ్రామస్థులతో చర్చలు జరిపారు. రెండు రోజుల్లో స్థానికులకు ఉపాధి కల్పిస్తామని న్యాయం చేస్తామని ప్రమోటెక్ కంపెనీ ఎమ్మెల్యే ఆనందరావుకు హామీ ఇవ్వడంతో ఈ మేరకు గ్రామస్థులు ఆందోళన విరమించారు.

రేపు మోగనున్న నెలగంట!



ధనుర్మాసం ఆరంభం.. గ్రామాల్లో సంతరించుకోనున్న సంక్రాంతి శోభ

(ఆంధ్రజ్యోతి- అమలాపురం రూరల్)

ధనుర్మాసం నెల ప్రారంభమైందంటే చాలు సంక్రాంతి సందడి మొదలవుతుంది.. సనాతన కాలం నుంచి సంక్రాంతిని నెలరోజుల పండుగగా జరుపుకుంటున్నారు. సూర్యుడు వృశ్చిక రాశి నుంచి ధనుస్సు రాశిలోకి ప్రవేశించడంతో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమవుతాయి. సూర్యుడు ధనుస్సులోకి ప్రవేశించగానే దేవాలయాల్లో మోగించే ఘంటానాదాన్నే నెలగంట అంటారు. ఈనెల 16నుంచి శ్రీవైష్ణవులు ధనుర్మాస ఉత్సవాలను ప్రారంభిస్తారు. ధనుర్మాసం ప్రశస్తిని సాక్షాత్తు బ్రహ్మదేవుడు నారదమునికి వివరించారు. బ్రహ్మాండ పురాణం, భాగవతం, ఆదిత్య పురాణాల్లో ధనుర్మాసం ప్రస్తావన ఉంది. శ్రీవైష్ణవులకు పరమ పవిత్రమైన ఈ మాసంలో శ్రీరంగనాధుడిని ప్రసన్నం చేసుకునేందుకు గోదాదేవి పాడిన తిరుప్పావై పాశురాలకు ఎనలేని ప్రాధాన్యత ఉంది. ఈ మాసంలోనే తిరుప్పావై వ్రతదీక్షలు ఉంటాయి. ఈ మాసంలోనే గోదాదేవి(ఆండాళ్) శ్రీమన్నారాయణుని అర్చించి తరించింది. పన్నిద్దరాళ్వారులలో ఈమె ఒకరు. ఈమెను సాక్షాత్తు భూదేవి అవతారంగా భావిస్తారు. ప్రతి ఏటా కనుమ పండుగ నాడు గోదాదేవి కల్యాణం వైభవంగా జరిపిస్తారు.

ఈ మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని ముక్కోటి ఏకాదశి అని పిలుస్తారు. ఈరోజున ఉత్తర ద్వారం(వైకుంఠ ద్వారం) నుంచి దేవతలు విష్ణుమూర్తిని దర్శించేందుకు వైష్ణవ ఆలయాలకు విచ్చేస్తుంటారని చెపుతారు. ఉత్తర ద్వారం నుంచి దేవదేవుని దర్శించేందుకు భక్తులు అధిక ప్రాధాన్యతనిస్తారు. ఇదే నెలలో శుద్ధ పౌర్ణమి రోజున శివాలయాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. వైష్ణవాలయాల్లో అందించే బాలబోగం ప్రసాదానికి ప్రాధాన్యత ఉంటుంది. సంక్రాంతి పిండివంటల గురించి ఇక చెప్పనవసరం లేదు.

ముత్యాల ముగ్గులు.. గొబ్బెమ్మలు..

సంక్రాంతికి నెలరోజుల ముందు నుంచే తెలుగింటి వాకిళ్ల రంగవల్లుల సింగారంతో మురిసిపోతాయి. మహిళలు రకరకాల రంగులతో కళ్లు చెదిరేలా వాకిళ్లన్నీ ముగ్గులతో ముస్తాబు చేస్తారు. భూ అలంకరణను సంప్రదాయ కళగా పేర్కొంటారు. మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తికి ముగ్గులు నిలువుటద్దంగా నిలుస్తాయి. వేదాల్లో కనిపించే చతురస్రాలు, స్వస్తిక్ గుర్తులే తొలినాళ్లల్లో రంగవల్లులకు ప్రేరణగా నిలిచాయంటారు. ఇక ఖగోళశాస్త్ర విషయాలను తెలుసుకునేందుకు నేలపై ముగ్గులతో బొమ్మలు గీసుకునేవారని, ఇవే కాలక్రమంలో రంగవల్లికలుగా మారినట్టు చెబుతారు. గణిత శాస్త్రంలోని ప్లస్‌లు, మైనస్‌లు, త్రికోణాలు, దీర్ఘ చతురస్రాలు, వృత్తాలు.. ఇలా అన్ని ముగ్గులలో కనిపించడమే దీనికి నిదర్శనం.

ఆరోగ్యదాయకం.. వ్యాయామం..

ఆవుపేడతో కల్లాపి చల్లడం వల్ల పేడలోని ఔషధ గుణాలు, క్రిమికీటకాలపై ప్రభావం చూపి వాటిని నాశనం చేస్తాయి. పేడ చల్లిన ప్రాంతం నుంచి వీచే గాలులు సైతం ఇంటిలోని రోగకారక క్రిములను తరిమికొడతాయి. ఇక రోడ్లపై దుమ్ము ఎగిరి అనారోగ్యం కలిగించకుండా చూస్తుంది. వరి పిండితో వేసే ముగ్గులతో పురుగులు, ఇతర జీవులకు ఆహారమందించినట్టవుతుంది. ముగ్గులు పెట్టడం ఎంత కళాత్మకమో మెదడు మొదలు వేళ్ల చిగుళ్ల వరకు మంచి వ్యాయామం కల్పించే సాధనంగా చెప్పాలి. తెలవారుతున్న వేళ ముగ్గులు వేయడం వల్ల సూర్య కాంతి పడి శరీరానికి కావాల్సిన ఎన్నో విటమిన్లు అందుతాయి. నీళ్ల చల్లడం, ముగ్గులు వేసేటప్పుడు కూర్చుని, నించుని, ఒంగొని, చేతివేళ్లను, పాదాలను అటూఇటూ కదుపుతూ ఉండడం వల్ల శరీరంలోని అన్ని భాగాల్లో కదలిక జరిగి ఉత్సాహభరితంగా మారడమే కాకుండా శరీర భాగాల్లో పేరుకున్న అనవసరపు కొవ్వు కరిగి బరువు తగ్గుముఖం పట్టి ఆరోగ్యాన్నిస్తుంది.

కళాశాలల్లో ఫ్యాషన్‌గా సంక్రాంతి

సంక్రాంతి పండుగ వస్తుందంటే పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు విద్యార్థుల్లో సందడి నెలకొంటుంది. జనవరి ప్రారంభం నుంచి ఆయా కళాశాలల్లో సంక్రాంతి వేడుకలను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా మారిపోయింది. విద్యార్థినులే స్వయంగా పిండి వంటలు తయారు చేస్తారు. ఇక వారికి ప్రత్యేకంగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. భోగి మంటలు వేయడంతో పాటు ప్రభల ఊరేగింపు నిర్వహించడం, హరిదాసులు, గంగిరెద్దుల ఆటపాటలు చూస్తుంటే సందడిగా ఉంటుంది.





ఈ భవనానికి.. 75 గుమ్మాలు



ఆ భవనం నిర్మించి 86 ఏళ్లు కావస్తోంది. 26 స్తంభాలు, నాలుగు ప్రధాన ద్వారాలతో విశేషంగా ఆకట్టుకుంటున్న ఆ పురాతన భవనం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ముంగండలో గ్రామంలో బ్రాహ్మణవీధిలో ఉంది. పూర్వం ఆ గ్రామంలో మునులు సంచరించడంతో మునిఖండ అగ్రహారంగా కూడా పిలవబడేది. మంత్రవాది సుబ్బారాయుడు నిర్మించుకున్న ఆ భవనాన్ని 1938 ఏప్రిల్ 24వ తేదీన గృహప్రవేశం చేశారు. మొత్తం 75 గుమ్మాలు, నాలుగు ప్రధాన ద్వారాలు, 26 ప్రధాన స్తంభాలతో కూడిన భవనాన్ని అప్పట్లో గానుగ సున్నంతో నిర్మించినట్టు చెప్తున్నారు. ఆరోజుల్లో రూ.75 వేలతో నిర్మించిన ఇల్లుకు పైకప్పు సైతం దూలాలు ఏర్పాటుచేసి గానుగ సున్నంతో శ్లాబ్, గోడలను సైతం నిర్మించారు. అందుకే ఆ ఇంట్లో నిత్యం వేడి వాతావరణం ఉంటుందని ఇంటి యజమాని ఒకరు తెలిపారు. ప్రస్తుతం మంత్రవాది సూర్యనారాయణ, మంత్రవాది ప్రసాద్‌లు నివాసం ఉంటున్నారు. కుటుంబీకులు ఎక్కువగా హైదరాబాదులో ఉండడంతో తమ రెండు కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయని ప్రసాద్ తెలిపారు. ఈరోజుల్లో ఇటువంటి కట్టడాలు కట్టలేరని ఇల్లంతా టేకు కలపతో నిండిఉందన్నారు. ఉద్యోగాలు నిమిత్తం పట్టణాలు బాటపడుతున్న తరుణంలో ఇటువంటి పురాతన కట్టడాల పరిస్థితి ఇక ప్రశ్నార్థకమే.

- పి గన్నవరం



రాజమహేంద్రవరం నగరంలో గాలి నాణ్యతను పెంపొందించే మిషన్



వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న నగర కమిషనర్ కేతన్‌గార్గ్ (ఫైల్)

ప్రయోగాత్మకంగా ఇప్పటికే నగరంలో పలు ప్రాంతాల్లో గాలిలో స్ప్రేయింగ్

(ఆంధ్రజ్యోతి-రాజమహేంద్రవరం సిటీ)

గాలిలో నాణ్యతను పెంపొందించే వాటర్ స్ప్రింకిల్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్ వాహనాన్ని రాజమహేంద్రవరంలో తొలిసారిగా వినియోగించారు. నగరంలో పెరిగిపోతున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనికోసం గాలిలో నాణ్యతను పెంపొందించే వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్ వాహనాన్ని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ రూ.47.79 లక్షల వ్యయంతో కొనుగోలు చేసింది. దానిని త్వరలోనే నగరంలో రహదారులు వెంబడి తిప్పి వాయు కాలుష్యాన్ని తగ్గించే పనిలో నగరపాలక సంస్థ నిమగ్నమైంది. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ) లో భాగంగా గాలి నాణ్యతను పెంచడానికి ఎన్కాప్ నిధులతో వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్‌ను కొనుగోలు చేసినట్టు కమిషనర్ కేతన్‌గార్గ్ చెప్పారు. ఈ వాహనం నుంచి మంచినీటిని గాలిలోకి వెదజల్లడం ద్వారా గాలిలోని కాలుష్యాన్ని తగ్గించబడుతుంది. ఈ వాహనంలో క్లోరిన్ తక్కువగా వేసి శుద్ధిచేసిన నీటిని 8 వేల లీటర్లను ఫిల్ చేస్తారు. ఇది రెండున్న గంటలపాటు వస్తుంది. ఈ సమయంలో మొత్తం నీటిని గాలిలో స్ప్రే చేస్తుంది. దీంతో గాలిలో దుమ్ము, విసర్జిత పదార్థాలు తగ్గుతాయి. కాలుష్య ప్రాంతాలను గుర్తించి అక్కడ వాహనం ద్వారా నీటిని వెదజల్లేందుకు షెడ్యూల్ తయారు చేశారు. ఈ వాహనంలో డ్రైవర్, ఆపరేటర్ ఉంటారు. అభివృద్ధి చెందిన నగరాలకు మాత్రమే పరిమితమైన ఈ వాహనం ఇప్పుడు రాజమహేంద్రవరంలో తిరగబోతోంది. వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్ వాహనాన్ని ఇటీవల ప్రయోగాత్మకంగా నగరంలోని టెస్ట్ డ్రైవ్ చేసి స్ప్రేచేశారు. ఇప్పుడు స్థానికంగా ఉన్న డ్రైవర్, ఆపరేటర్‌లకు శిక్షణ ఇచ్చి వారంరోజుల్లో రాజమహేంద్రవరం రోడ్లపైకి వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్ వాహనం తీసుకువస్తారు. వాయు కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు చేపడతారు.



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

నమో వేంకటేశాయా...

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.38,45,961



వాడపల్లి వెంకన్న ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్రేయపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తజన గోవిందనామస్మరణతో మార్మోగింది. శనివారం వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా గోవిందనామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు. కాలినడకన చేరుకున్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తులాభారాలు, కానుకలు సమర్పించుకుని శ్రీనివాస ప్రాంగణంలోని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.38,45,961 లభించినట్టు ఉపకమీషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.



సువాసనలు వెదజల్లే పెద్ద అగరబత్తి

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుగంధ పరిమళాలు వెదజల్లే అతిపెద్ద అగరబత్తిని వెలిగించారు. శనివారం మంగళదీప్ కంపెనీకి చెందిన పెద్ద అగరబత్తిని వసంత మండపంలో వెలిగించారు. సువాసనలు, వెదజల్లడంతో భక్తులు విశేషంగా ఆశ్వాదించారు. 24 గంటల పాటు ఈ అగరబత్తి వెలుగుతుండటం విశేషం.

నేడు సత్యదేవుడి సన్నిధిలో మెట్లోత్సవం

- మెట్టు,మెట్టుకు పసుపు, కుంకుమలు హారతులు



సత్యదేవుని మెట్లమార్గం

అన్నవరం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిత్యం భక్తకోటితో పూజలందుకుంటున్న సత్యదేవుడు తనవద్దకు చేర్చే మెట్లకు ఏడాదిలో ఒకసారి పూజలందుకుంటాయి. ధనుర్మాస ప్రారంభసూచికగా ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలోభాగంగా ఆదివారం ఉదయం 6గంటలకు స్వామి,అమ్మవార్లను మేళతాళాలతో కొండదిగువకు తోడ్కొనివచ్చి గ్రామోత్సవం నిర్వహిస్తారు. అనంతరం 9గంటలకు తొలిపావంచావద్ద స్వామి, అమ్మవార్లను ఉంచి ప్రత్యేకపూజలు నిర్వహించి తొలిమెట్టు వద్ద ఈవో, ఇతర అధికారులు ముత్తైదువులతో పసుపు, కుంకుమ పూసి. హారతులిచ్చి, నైవేద్యాలు సమర్పిస్తారు. తొలిమెట్టు నుంచి ప్రధానాలయం వద్ద ఉన్న చివరిమెట్టు వరకు ఇదేవిధంగా పండితులు, భక్తులు పూజిస్తారు. ఈ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. మెట్లకు పసుపు, కుంకుమలు రాసేందుకు అన్న వరం, పరిసర ప్రాంతాల నుంచి మహిళలు అధికసంఖ్యలో విచ్చేస్తారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ

రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాల యం నుంచి తిరుచ్చివాహనంపై తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చి మేళతాళాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమముమ్మారు ప్రదక్షణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

కానరాని పులి ఆచూకీ

ప్రత్తిపాడు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం బురదకోట రిజర్వ్‌ఫారెస్ట్‌లో సంచరించిన పులి ఆచూకీ వారంరోజులు నుంచి కానరాలేదు. బురదకోట రిజర్వ్ ఫారెస్ట్‌లో లేగదూడను చంపి తిన్న పెద్దపులి మళ్లీ కనిపించకుండా పోయింది. గతవారం రోజులుగా ఈ పులి జాడ కోసం అటవీశాఖాధికారులు ట్రాప్ కెమెరాలు ఏర్పాటుచేసి గాలింపు జరిపినా పులి జాడ లభ్యం కాలేదు. దీంతో పులి బురదకోట రిజర్వ్ ఫారెస్ట్ నుంచి ఇతర ప్రదేశాలకు తరలివెళ్లిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పులి పాదముద్రల ఆనవాళ్లు కూడా లభించలేదు. బురదకోట రిజర్వ్‌ఫారెస్ట్ చుట్టూ ఉన్న సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజన గ్రామాల ప్రజలను అటవీశాఖాధికారులు అప్రమత్తం చేశా రు. పులి ఎదురైనా, సంచరించిన సమాచారం అందించాలని, పులి బారిబడి తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు గిరిజనులకు అటవీశాఖ సిబ్బందికి కరపత్రాలు పంపిణీ చేస్తూ వివరిస్తున్నారు.

ఘనంగా భీమేశ్వరుడి జన్మ నక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామి

ద్రాక్షారామ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరుడి జన్మనక్షత్ర పూజలు శనివారం ఘనంగా జరిగాయి. స్వామి జన్మనక్షత్రం మార్గశిర చతుర్థశి(పాషాణ చతుర్థశి) పురస్కరించుకుని ఉదయం 5 గంటలకు తీర్థపు బిందె, సుప్రభాత సేవ జరిగింది. అనంతరం బాలబోగం సమర్పించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు, పురోహితులు, స్వస్తివాచకులచే 6.00 గంటలకు సంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవాచనం అనంతరం భీమేశ్వరస్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. తదుపరి భీమేశ్వరస్వామివారికి లక్షబిళ్వార్చన వేదమంత్రాలతో నిర్వహించారు. మాణిక్యాంబ అమ్మవారికి లక్షకుంకుమార్చన జరిగింది. పూజాధికాల్లో మంత్రి సుభాష్ తండ్రి, టీడీపీ నేత వాసంశెట్టి సత్యం పాల్గొన్నారు.

నందివాహనంపై నగరోత్సవం

భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లకు పుష్పాలంకృతమైన నంది వాహనంపై మేళతాళాలు మంగళవాయిద్యాలతో నగరోత్సవం నిర్వహించారు. జన్మనక్షత్రం పురస్కరించుకుని భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవారిని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు. రాత్రి సోమవార మండపంలో స్వామివారికి ఆస్థాన పూజ నిర్వహించారు అనంతరం నీరాజన మంత్రపుష్పములు సమర్పించారు. మాస శివరాత్రి కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో వెయ్యి ఒకటి శివలింగాలకు సప్తగోదావరి జలాలతో అభిషేకం నిర్వహించారు. శివమాలధారణ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హోమం, పూర్ణాహుతి జరిపారు.

మాణిక్యాంబ అమ్మవారికి వెండికవచం బహూకరణ

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో అష్టాదశ శక్తిపీఠం మాణిక్యాంబ అమ్మవారికి ఇంద్రగంటి ఆంజనేయశర్మ కుమార్తె కొమరిగిరిపట్నంకు చెందిన ఎం.ఎస్.దీప్తి 2 కేజీల వెండి కవచం బహూకరించారు. శనివారం భీమేశ్వరస్వామివారి జన్మనక్షత్రం పురస్కరించుకుని ఆలయసహాయక మీషనరు అల్లు వెంకట దుర్గాభవానికి వెండి కవచం దీప్తి అందజేశారు.

అన్నవరం దేవస్థానం నూతన ఈవోగా వీర్ల సుబ్బారావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన ఈవో వీర్ల సుబ్బారావు

అన్నవరం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం నూతన ఈవోగా వీర్ల సుబ్బారావు శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా స్వామివారి ఆలయానికి చేరుకున్న ఆయనకు సిబ్బంది సాదరస్వాగతం పలకగా స్వామిని దర్శించుకుని అనివేటి మండపంలో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషిచేస్తానని అన్నారు. అనంత రం ఆయన మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిని మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.సహాయకమిషనర్ రామ్మోహనరావు, పీఆర్వో కొండలరావు, విష్ణు పాల్గొన్నారు.



శిక్షణ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

త్వరలో బీసీ యాక్షన్ ప్లాన్

- మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ ప్రారంభంలో మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ యాక్షన్ ప్లాన్ మాదిరిగానే త్వరలో బీసీ యాక్షన్ ప్లాన్ ద్వారా యువతకు మరిన్ని అవకాశాలను కూటమి ప్రభుత్వం కల్పించబోతుందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం బీసీ స్టడీ సర్కిల్‌లో మెగా డీఎస్సీ 2024-25 ఉచిత శిక్షణ తరగతులను లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమైందన్నారు. గత ప్రభుత్వం డీఎస్సీ అంటూ ఊరించి అభ్యర్థులను నిరాశకు గురిచేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 16 వేల పైచిలుకు పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించిందన్నారు. విజయానికి షార్ట్‌కట్ అనేది ఉండదని కష్టపడి చదవడమే విజయానికి ఏకైక మార్గమని సూచించారు. 14 ప్రదేశాల్లో బీసీ,ఎస్టీ హాస్టళ్లలో సీఎస్‌ఆర్ ఫండ్ ద్వారా మెరుగైన వసతుల కల్పనకు కృషి చేసిన కలెక్టర్ ప్రశాంతిని అభినందించారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి సబ్జెక్టుపై అవగాహన,చిత్తశుద్ధి,దృఢ సంకల్పం ఉండాలన్నారు. 220 మంది అభ్యర్థులకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులద్వారా శిక్షణ అందిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని అందుకే విద్యాప్రమాణాలు పెంచుతుందన్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి మాట్లాడుతూ బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ తరగతులను వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీవో ఆర్.కృష్ణనాయక్, బీసీ స్టడీ సర్కిల్ ఇన్‌చార్జి డైరెక్టర్ కేఎన్ జ్యోతి, బీసీ సంక్షేమ అధికారి పీఎం.రమేష్, సీనియర్ ఫ్యాకల్టీ సూర్యప్రకాశరావు, వసతి గృహాల వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.



సూర్యోదయం

జగ్గంపేట పంట పొలాల్లో శనివారం తెల్లవారు జామున సూర్యోదయ సమయంలో మంచుతెరల్లోంచి వచ్చిన సూర్యుడి ప్రతిబింబం పంట పొలాల్లో చూపరులను కనువిందు చేసింది.

-జగ్గంపేట

ప్రభుత్వ ఉద్యోగ సంఘాల బల ప్రదర్శన

● ఒక సంఘం మహాసభ.. మరొక సంఘం వనభోజనాలు ● మంత్రి, ఎమ్మెల్యేలకు ఆహ్వానం



మహాసభలో మాట్లాడుతున్న ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 14(ఆంధ్ర జ్యోతి): గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను విధ్వంసం చేసింది.. ఆ పరిస్థితులను అధిగమించి రాష్ట్ర ప్రగతిని సాధించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెఆర్.సూర్యనారాయణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జేకే గార్డెన్స్‌లో శనివారం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రమేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన మహాసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన తర్వాత తమ సంఘ జిల్లా కమిటీలు ఏర్పాటు చేసుకుని సభ్యత్వాలు నమోదు ప్రారంభించామన్నారు. ఇప్పటివరకు 76శాతం మంది ఉద్యోగులు సభ్యత్వాలు తీసుకుని సంఘాన్ని మరింతగా ప్రోత్సహించారని తెలిపారు. ఉద్యోగుల సమస్యలు, ఉద్యోగస్తులకు పెండింగ్ బకాయిలు, డీఏ బకాయిలు, ఐఆర్ ప్రకటిస్తామని హామీ ఇవ్వడం తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని బట్టి సమస్యల పరిష్కారానికి కాలవ్యవధి పెట్టుకోవాలన్నారు. వేతన సవరణకు సంబంధించి కమిషన్ వేయడంలో న్యాయబద్ధంగా విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. సభకు హాజరైన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌లకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందించారు. ఉద్యోగ సమస్యలపై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తప్పక సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అనంతరం ఏపీజీఈఏ జిల్లా నూతన అధ్యక్షుడిగా పి.గిరిప్రసాద్ వర్మ, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ఎస్ విల్సన్‌పాల్, సహాధ్యక్షుడిగా చాంబర్లీన్, జిల్లా ఉపాధ్యక్షులుగా రవికుమార్, రాజారావు, కార్యదర్శిగా రమేష్, దినేష్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో ఏపీజీఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.రమేష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కేదారీశ్వరరావు, వీఆర్‌వోల సంఘ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు రవీంద్రరాజు, ఉద్యోగుల ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి బాజీపఠాన్, వ్యవసాయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టీవీ.రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సభకు హాజరైన ఉద్యోగులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మాదంటే మాదంటూ రెండు వర్గాలు వాదులాడుకుంటున్న సంగతి తెలిసిందే. కెఆర్ సూర్యనారాయణ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీ చిచ్చుపెట్టిన సంగతి తెలిసిందే. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సూర్యనారాయణ సంఘం నుంచి ప్రధాన కార్యదర్శి ఆస్కారరావు తదితరులను బహిష్కరించగా తామే సూర్యనారాయణను బహిష్కరించినట్టు ఆస్కారరావు తదితరులు చెప్పుకోవడంతో పాటు సూర్యనారాయణకు వ్యతిరేకంగా రాజమహేంద్రవరానికి చెందిన శ్రీకాంత్‌రాజును ప్రెసిడెంట్, ఆస్కారరావు ప్రధాన కార్యదర్శిగా సంఘం నడుపుతున్నారు. గత 3 నెలలుగా వారి మధ్య బాగా విభేదాలు పెరిగాయి. సూర్యానారాయణ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం స్థానిక జెకె గార్డెన్‌లో ఉద్యోగుల మహా సభ నిర్వహించింది. దానికి పోటీగా శ్రీకాంత్‌రాజు తదితరులు ప్రముఖ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో అని చెబుతూ పుష్కర వనంలో వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఇరువర్గాలు మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ఆది రెడ్డి శ్రీనివాస్‌లను ఆహ్వానించారు. 2చోట్లకు నాయకులు హాజరయ్యారు. ఈ రెండు సంఘాల మధ్య కోర్టు కేసులు కూడా ఉన్నట్టు సమాచారం. సంఘ నేతల మధ్య ఆధిపత్య పోరు వల్ల అసలు మేలు జరుగుతుందా లేక ఈ సంఘాలు నామమాత్రంగానే తమ పబ్బం గడుపుకుంటాయా అనే అనుమానాలు ఉద్యోగుల్లో ఎక్కువయ్యాయి.

సమస్యల పరిష్కారానికి సేవకుడిలా కృషి

● మంత్రి కందుల దుర్గేష్



మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న శ్రీకాంత్, ఆస్కారరావు తదితరులు

దివాన్‌చెరువు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి సేవకుడిలా కృషి చేస్తానని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా లాలాచెరువు సమీపంలోని గోదావరి మహాపుష్కర వనంలో శనివారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డి.శ్రీకాంత్‌రాజు, ప్రధాన కార్యదర్శి జి.ఆస్కారరావు ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి ఉద్యోగ వేదిక సమస్యల పరిష్కారాలు వనభోజనం అనే కార్యక్రమానికి మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా మహాజన సభలో ఉద్యోగులందరూ ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించిన డిమాండ్లను జాబితాను వారికి అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఉద్యోగుల పీఆర్సీ, జీపీఎస్ అమలుపై గత ప్రభుత్వం కాలయాపన చేసిందని కానీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమై చర్చించుకుని కార్యాచరణ రూపొందించుకుందామన్నారు. వనభోజనాలు కుల భోజనాలుగా మారిన ఈ రోజుల్లో ఉద్యోగులంతా కలసి నిర్వహించుకుంటున్న ఈ వనభోజనాలు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ఉద్యోగుల స్నేహపూర్వక ప్రభుత్వమని, ఉద్యోగస్తులందరికీ మంచి జరుగుతుందన్నారు. శ్రీకాంత్‌రాజు, ఆస్కారరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగులకు అనేక రకాల ఆశ చూపి రివర్స్ పీఆర్సీ ఇచ్చిందన్నారు. నేటికీ అనేక డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం వాటిని త్వరగా విడుదల చేయాలని కోరారు. అలాగే ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ వంటి ఖాతాల్లో సొమ్మును విత్‌డ్రా చేసుకునే, లోన్‌లు పొందే అవకాశాన్ని పునరుద్ధరించాలన్నారు. కేవలం ఒక వ్యక్తి వల్లనే సంఘం అనేక ఒడిదుడుకులకు లోనుకావడం సంఘాల చరిత్రలో ఎన్నడూ చూడలేదన్నారు. ఈ ఏడాది జూలై 26న సంఘ అధ్యక్షుడిగా కేఆర్ సూర్యనారాయణ సంఘ బహిష్కరణను ఆమోదించడం, ఉద్యోగభద్రతకు పాటుపడడం, ఇబ్బడిముబ్బిడిగా పెరిగిపోయిన మొబైల్‌యాప్‌లను తొలగించాలి తదితర తీర్మానాలను ఆమోదించామని వారు తెలిపారు. అనంతరం వనభోజనాలు జరిగాయి. ఉద్యోగులు ఆడిపాడారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వైద్యఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, వీఆర్వో, సచివాలయ ఉద్యోగులు తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన నాయకులు, దాదాపు 1500 మంది ఉద్యోగులు హాజరయ్యారు.

దొంగనోట్ల ముఠా కోసం గాలింపు

6 ప్రత్యేక బృందాల ఏర్పాటు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సినీఫక్కీ రీతిన రాజమహేంద్రవరంలో శ్రీకాకుళం పోలీసులపై ఎటాక్ చేసి దొంగ నోట్ల ముఠాను పట్టుకునేందుకు తూర్పుగోదావరి జిల్లా పోలీసులు 6 ప్రత్యేక బృందాలను నియమించారు. ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు బృందాలు దొంగ నోట్ల ముఠా ఆచూకీ కోసం గాలిస్తున్నాయి. దొంగనోట్ల ముఠాలోని కీలక వ్యక్తి పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన ప్రభాకర్‌ను భీమవరంలో అరెస్టు చేసిన శ్రీకాకుళం పోలీసులు అతడిని రాజమహేంద్రవరంలో ఉన్న మరొక వ్యక్తిని అరెస్టు చేసేందుకు శుక్రవారం రాత్రి కారులో బయలుదేరారు. అయితే రాజమహేంద్రవరం ఆర్‌టీసీ కాంప్లెక్స్-వీఎల్ పురానికి మధ్య శ్రీకాకుళం పోలీసులపై ఎటాక్ చేసి 2 కార్లలో దొంగనోట్ల ముఠా సభ్యులు ప్రభాకర్‌ను తీసుకెళ్లిపోయారు. ఈ సంఘటనపై రాజమహేంద్రవరం ప్రకాశ్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులపై ఎటాక్ చేసి దాడి చేసిన సంఘటనపై చాలా తీవ్రంగా పరిగణించి 6ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ దొంగల ముఠాలో రాజమహేంద్రవరానికి చెందిన మూర్తి అనే వ్యక్తి ఎవరనే దానిపై ఉత్కంఠం నెలకొంది. ఈ ముఠాతో రాజమహేంద్రవరానికి ఉన్న లింక్ నేపథ్యంలో కేసు దర్యాప్తు సాగుతున్నట్టు తెలిసింది. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు.

కల్వర్టును ఢీకొన్న వ్యాన్

ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

చింతూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యాన్ కల్వర్టును ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ పి.రమేష్ కథనం మేరకు.. రాజానగరం మండలం రామాపురానికి చెందిన కామశెట్టి చంద్రరావు హోల్ సేల్ పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం రాజమండ్రి నుంచి వ్యాన్‌లో పండ్లు లోడ్ వేసుకుని చింతూరు మీదుగా కుంట వెళ్తున్న క్రమంలో చింతూరు మండలం వీరాపురం వద్ద వ్యాన్ కల్వర్టును ఢీ కొని పల్టీ కొట్టింది. దీంతో చంద్రరావు తీవ్రంగా గాయపడ్డాడు. వ్యాన్ డ్రైవర్‌తో పాటు చంద్రరావు భార్య స్వల్పంగా గాయపడగా వారిని చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. చంద్రరావు (75) చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు.



మృతిచెందిన కామశెట్టి చంద్రరావు

గోదావరి జిల్లాల క్రీడాభివృద్ధికి కృషి

నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య శ్రీనివాసరావు

ముగిసిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కం విశ్వవిద్యాలయ జట్టు పోటీలు



చాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకుంటున్న రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల జట్టు

దివాన్‌చెరువు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యాయామ విద్య అధ్యాపకులంతా సమష్టిగా పనిచేసి గోదావరి జిల్లాల క్రీడాభివృద్ధికి కృషిచేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నన్నయ వర్సిటీ విద్య కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కం విశ్వవిద్యాలయ జట్టు పోటీలు శనివారం ముగిశాయి. 24 ఈవెంట్స్‌లో జరిగిన ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కళాశాల స్థాయి క్రీడా క్యాలెండర్‌ను తయారు చేసి దానికి తగ్గట్టుగా ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని క్రీడాకారులను రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు పతకాలను, ట్రోఫీలను అందజేశారు. అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. మహిళా ఛాంపియన్ షిప్ ట్రోఫీని భీమవరంలోని డీఎన్ఆర్ కళాశాల కైవసం చేసుకుంది. విశ్వవిద్యాలయం ఫాస్టెస్ట్ మహిళా రన్నర్‌గా గోపన్నపాలెంలోని ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ కళాశాలకు చెందిన వి.జయశ్రీ, పురుషుల రన్నర్‌గా గొల్లలమామిడాడలోని డీఆర్‌కే రెడ్డి కళాశాలకు చెందిన రాంబాబు ట్రోఫీలను అందుకోగా వీసీ అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కార్యనిర్వాహక చైర్మన్ కొండ్రు సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శి సీహెచ్‌వీ సుబ్రహ్మణ్యం, పీడీలు ప్రమీలారాణి, సాల్మన్ దేవానంద్, బాలసత్యనారాయణ, రామ్‌గోపాల్, ఫణీంద్ర, మూర్తి, రత్నబాబు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురి నిందితుల అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగదుర్గారావు

కాకినాడ క్రైం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వార్ఫురోడ్డులో ఈ నెల 2వ తేదీన జరిగిన హత్య కేసులో నిందితులను వన్‌టౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. సీఐ ఎం నాగదుర్గారావు నిందితుల వివరాలను వెల్లడించారు. స్థానిక పాతబస్టాండ్ వెంకటేశ్వరా కాలనీకి చెందిన బొచ్చు దాలయ్య అలియాస్ దాలీ (29) వార్ఫు రోడ్డులోని సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ పక్క సందులో అపస్మారక స్థితిలో రక్తపు మడుగులో పడి ఉండగా స్థానికులు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. అనంతరం వన్‌టౌన్ సీఐ నాగదుర్గారావు, సిబ్బంది అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి ఫొరెన్సిక్ వైద్యులుఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా ఈనెల 12వ తేదీన హత్యకేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితులైన కచ్చేరిపేటకు చెందిన 20 ఏళ్ల పూడి మణికంఠ అలియాస్ మున్నా, పాతబస్టాండ్ చెందిన 29 ఏళ్ల చందాడి నాగబాబు అలియాస్ నాని, వెంకటేశ్వరా కాలనీకి చెందిన 39 ఏళ్ల కర్రి సంతోష్ అలియాస్ చిన్నాలను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో కాకినాడ ఈట్‌స్ట్రీట్‌లో ఉన్న కృపా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్దకు దాలీ మద్యం మత్తులో తరచూ వెళ్లి న్యూడిల్స్, ఫ్రైడ్ రైస్ ఉచితంగా ఇమ్మని గొడవ చేసి వారి వ్యాపారానికి ఆటంకం కలిగించేవాడు. ఈ విధంగా పలుసార్లు వేధించడంతో వారు విసుగు చెంది దాలిని చంపేద్దామని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 1న ఫాస్ట్ ఫుడ్ సెంటర్ దగ్గరికి తాగి వచ్చి గొడవ చేయగా తనకు కావాల్సిన ఫుడ్ ఇవ్వకపోయేసరికి కర్రి సంతోష్, చందాడి నాగబాబుల ఇళ్లకు దాలి వెళ్లి గొడవ చేశాడు. దాంతో అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ పక్క సందులో దాలి నడిచి వెళ్తుండగా నిందితులు ఇనుప రాడ్లతో తలపై మోది అక్కడ నుంచి పరారయ్యారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి శనివారం కోర్టుకు తరలించగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ నాగదుర్గారావు తెలిపారు.

వైభవంగా దత్తస్వాముల నగరోత్సవం



దత్తాత్రేయస్వామి రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈవో శ్రీనివాస్, దత్త గురువు శ్రీనివాసరావు

పిఠాపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో దత్తస్వాముల నగరోత్సవం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్తాత్రేయస్వామి సన్నిధిలో జరుగుతున్న దత్తాత్రేయ జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా ఆరోరోజు స్వామికి లక్ష తులసి అర్చన నిర్వహించారు. దత్తమాల ధరించిన భక్తులకు ఇరుముడి ధారణ జరిగింది. దత్త గురువు వాడ్రేవు శ్రీనివాసరావు మాలధారులకు ఇరుముడిధారణ చేశారు. సాయంత్రం దత్తస్వాముల నగరోత్సవం వైభవంగా జరిగింది. దత్తాత్రేయస్వామి ఉత్సవ మూర్తిని రథంపై ఉంచి దత్తనామస్మరణతో స్వాములు ప్రదర్శనగా తిరిగారు. మధ్యాహ్నం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాల్లో ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సూపరింటెండెంట్, వీరభద్రరావు, దత్త గురువు వాడ్రేవు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కనుల పండువగా తెప్పోత్సవం

పాదగయ క్షేత్రంలోని స్వయంభూ దత్తాత్రేయస్వామి తెప్పోత్సవం శనివారం రాత్రి కనుల పండువగా జరిగింది. పాదగయ పుష్కరిణిలో హంసవాహనంపై స్వామి విహరించారు. స్వామి ఉత్సవమూర్తులతో దత్తస్వాములు పాదగయలో ప్రదక్షిణలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉంచారు. దత్త గురువు వాడ్రేవు శ్రీనివాసరావు, ఈవో శ్రీనివాస్, భక్తుల ఉన్నారు.



హంసవాహనంపై దత్తాత్రేయస్వామి తెప్పోత్సవం

జాతీయస్థాయి సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ పోటీలకు...

బాలురు, బాలికల జట్ల ఎంపిక

రామచంద్రపురం (ద్రాక్షారామ), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆదివారం నుంచి హైదరాబాద్‌లో జరగనున్న జాతీయస్థాయి సబ్‌జూనియర్స్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఏపీ బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో ఈనెల 1 నుంచి 14 వరకు సబ్ జూనియర్ జాతీయ బాస్కెట్‌బాల్ కోచింగ్ క్యాంపు శాప్ పర్యవేక్షణలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్‌ఏపి, తూర్పుగోదావరి, రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గతంలో నిర్వహించిన పోటీల నుంచి ఎంపిక చేసిన 18 మంది క్రీడాకారుల్లో సబ్‌జూనియర్స్ జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల ఏపీ జట్టును ఎంపిక చేసినట్టు శాప్ కోచ్ ఎస్.సంతోష్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా పశ్చిమగోదావరి జిల్లా ఉల్లంపర్రు, మాంటిస్సోరిపాఠశాలలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్‌ఏపి, పశ్చిమగోదావరి బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 14 వరకు బాలికల జాతీయ బాస్కెట్‌బాల్ కోచింగ్ నిర్వహించినట్టు శాప్ కోచ్ పి.జగదీష్ తెలిపారు. జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ సబ్ జూనియర్ బాలికల పోటీలో పాల్గొనే ఏపీ బాలిక జట్టును ఎంపిక చేసినట్టు తెలిపారు. శిక్షణను పర్యవేక్షించిన బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ రాష్ట్ర కార్యదర్శి గన్నమని చక్రవర్తి బాలురు, బాలికల జట్ల క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

బాలుర జట్టు సభ్యులు

ఎస్.శ్రీసాయి చరణ్, వై.సుశ్రిత్, కె.ప్రణీత్, టి.గౌతమ్(తూర్పుగోదావరి), ఇ.చార్లెస్ వెస్లీ(పశ్చిమగోదావరి), జి.జగదీష్, ఎ.మనోఅభిరామ్(కృష్ణా జిల్లా), పి.జీవన్, బి.ఉజ్వల ఈశ్వర్‌సాయి, ఎం.సంతోష్(అనంతపురం), బి.ఎస్.కార్తికేయ(విశాఖ), బి.సత్యేంద్ర(గుంటూరు) ఎంపిక కాగా.. వి.కిరణ్ (తూర్పుగోదావరి), వి.వహివాట్సన్ (విశాఖ), వి.హర్షిత్(గుంటూరు) స్టాండ్‌బై క్రీడాకారులుగా ఎంపిక చేశారు.

బాలికల జట్టు సభ్యులు

సి.హెచ్. ఐశ్వర్యాంబిక, బి.సాలిని రత్న మాధురి, సిహెచ్. భువనేశ్వరి, డి.హాసిని(తూర్పుగోదావరిజిల్లా), బి.కుసుమ, బి.వర్షిణి, ఆర్.వర్షిణి(కృష్ణా), కె.ఆముక్త, వై.హిమవర్షిణి(విశాఖ), టి.అంజలి, ఎస్.జాస్మిన్(చిత్తూరు), ఎ.వి.ఎల్ అక్షయ(గుంటూరు) ఎంపిక కాగా పి.శాంతి, డి.శంకరి(తూర్పుగోదావరి), ఎస్.ఎస్.ఎన్.ఎస్. ఆకర్షలు స్టాండ్‌బై క్రీడాకారిణిలుగా ఎంపిక చేసినట్టు కోచ్ పి.జగదీష్ తెలిపారు.



జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన బాలుర జట్టు, బాలికల జట్టు సభ్యులు

మైక్రోబయాలజీ పరికరాల ప్రారంభం



పరికరాలను ప్రారంభిస్తున్న డా.నరసింహం

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): మానవ దేహంలోని రక్తం ద్వారా లోనికి చొచ్చుకుపోయిన సూక్ష్మజీవులను వేగంగా కనుగొని త్వరితగతిన చికిత్స అందజేసేందుకు అత్యాధునికమైన వైటెక్ ఎనలైజర్, బాక్ట్ అలెర్ట్ పరికరాలు ఎంతగానో దోహదపడతాయని ఆర్ఎంసీ ప్రిన్సిపాల్, డీఎంఈ, ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డా.డిఎస్‌విఎల్ నరసింహం అన్నారు. ఆర్ఎంసీకి అనుబంధమైన కాకినాడ జీజీహెచ్, మైక్రోబయాలజీ విభాగంలో శనివారం మైక్రోబయాలజీ విభాగాధిపతి డా.పివి ప్రసన్న కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మైక్రోబయాలజీ పరికరాలను ప్రారంభించిన నరసింహం మాట్లాడుతూ రాష్ట్ర వైద్య, మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ (ఏపిఎస్ ఎంఐడిసి) రూ.40 లక్షల నిధులతో వైటెక్ ఎనలైజర్, బాక్ట్ అలెర్ట్ పరికరాలను సమకూర్చిందన్నారు. ఈ పరికరాల ద్వారా రక్తంలోని కంటికి కనబడని సూక్ష్మక్రిములను త్వరితగతిన కనిపెట్టి మెరుగైన వైద్యం చికిత్సను అందించడంలో ఎంతో ఉపకరిస్తాయన్నారు. డా.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పరికరాల ద్వారా 30గంటల్లోపే నివేదిక వస్తుందని తద్వారా నాణ్యమైన వైద్య చికిత్స అందించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఎస్.లావణ్యకుమారి, ఆర్ఎం సీ వైస్ ప్రిన్సిపాల్ డా.ఏవిష్ణువర్ధన్, జీజీహెచ్ డిప్యూటీ సూపరిడెంట్ డా.శ్రీనివాసన్, మైక్రోబయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డా.నిర్మలా గ్రేస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.అరుణకుమారి పాల్గొన్నారు.

రగ్బీ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లు



రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు పిఠాపురం నుంచి ఎంపికైన జట్ల సభ్యులు

పిఠాపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే జట్లు కాకినాడ జిల్లా పిఠాపురం రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరాయి. గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో ఈనెల 15,16వ తేదీల్లో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ రగ్బీ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాల, బాలికల జట్ల సభ్యులు పిఠాపురం నుంచి రైలులో బయలుదేరి గుంటూరు చేరుకున్నారు. ఈ టీమ్‌కు మేనేజర్‌గా పీడీ శేషుకుమారి, సురేష్‌లు వ్యవహరిస్తారు. క్రీడాకారులను రగ్బీ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చైర్మన్ వి.రామన్నరాజు, అధ్యక్ష, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, పి.లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు కేతవరపు కృష్ణ, సీఈవో నాగలింగేశ్వరరావు, సభ్యులు అభినందించారు.

శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్‌లో రెండో రోజు ఐటీ దాడులు

పెద్దాపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో ఆదాయపన్ను శాఖ (ఇన్‌కంట్యాక్స్) అధికారుల దాడులు రెండో రోజు కొనసాగాయి. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు మట్టే సత్యప్రసాద్, మట్టే శ్రీనివాస్ ఇళ్లతో పాటు ఆయన బంధువులు, సిబ్బంది ఇళ్లలో కూడా దాడులు నిర్వహించారు. సంస్థలకు సంబంధించిన పలు కీలక ఫైళ్లను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. అలాగే వాలుతిమ్మాపురం, వడ్లమూరు వెళ్లే రహదారిలో ఉన్న శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమల్లో రికార్డులు తదితర వాటిని తనిఖీ చేసి సిబ్బందిని విచారించారు. గడచిన కాలంలో కొనుగోలు చేసిన భూములు, భవనాలకు సంబంధించిన వివరాలపై ఆరా తీసినట్లు తెలిసింది. అలాగే బినామీల పేరుతో పలుచోట్ల భూములు, భవనాలు, బంగారం కొనుగోలు చేసినట్టు ఐటీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. భూములు ఎంతకు కొనుగోలు చేశారు? కొన్ని భూములను ఎంతకు విక్రయించారు? వాటికి సంబంధించిన పత్రాలు, నిధులు, అకౌంట్లు నిర్వహణ వంటి అంశాలపై అధికారులు ఆరాతీసినట్లు తెలుస్తోంది. బృందాలుగా ఐటీ అధికారులు సంస్థకు సంబంధించిన కార్యాలయాల్లో సోదాలు చేపట్టడంతో పట్టణంలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

3,053 కేసులు పరిష్కారం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేసుల పరిష్కారంలో రాజీ మార్గమే రాజమార్గమని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. రాజమహేంద్రవరం జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ ఏడాది 4వ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి కేసులు పరిష్కరించారు. జాతీయ లోక్ అదాలత్‌లో శనివారం రాత్రి 9గంటల వరకు 3053 కేసులు పరిష్కరించారు. వాటిలో సివిల్ 514, క్రిమినల్ 2,405, పీఎల్‌సీ కేసులు 134 పరిష్కరించారు. కక్షిదారులకు సత్వర న్యాయం చేయాలనే లక్ష్యంతో పూర్వపు తూర్పుగోదావరి జిల్లా పరిధి 4 రెవెన్యూ జిల్లాల పరిధిలో ఉన్న కోర్టుల్లో బెంచీలు ఏర్పాటు చేసి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో సివిల్ కేసులు పరిష్కారంలో మొదటి స్థానంలో నిలవడం జరిగిందన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు నిర్వహించిన 3జాతీయ లోక్ అదాలత్ ద్వారా రూ.100 కోట్ల 7లక్షల 19 వేల మేరకు అవార్డ్ ఇచ్చినట్టు తెలిపారు. ఈ బెంచ్‌లలో వన్‌టైం సెటిల్‌మెంట్‌కు అవకాశం ఉందన్నారు. సివిల్ 944 క్రిమినల్ 5191 , మోటార్ వెహికల్ కేసులు 655, పీఎల్‌సీ 562 కలిపి 7352 కేసులు పరిష్కరించినట్టు తెలిపారు. ఒకటవ అదనపు జడ్జి ఆర్.శివకుమార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, రాజమండ్రి బార్ అధ్యక్షుడు టి.వీరేంద్రనాథ్,న్యాయమూర్తులు పాల్గొన్నారు.

రూ.1.50లక్షల విరాళం

మలికిపురం, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): మోరి లో శ్రీసీతారామలింగేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి మోరి గ్రామానికి చెందిన చింతా నరసింహారావు, వారి కుమారులు లావణ్యకుమార్, కిరణ్‌కుమార్ శనివారం రూ.1.50లక్షలు సహాయం అందించారు. కామిశెట్టి సూరన్న, జాన సునీల్, కొండా సత్యనారాయణ, జక్కంపూడి సూరిబాబు పాల్గొన్నారు.

సంస్కృతి ఉత్సవ్‌లో పతకాల పంట

అమలాపురం టౌన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆకొండి సింహాచలం సర్వీసుట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్కృతి ఉత్సవ్-2024 పోటీల్లో అమలాపురం శ్రీవాగ్దేవి పాఠశాల విద్యార్థులు 60మంది వివిధ విభాగాల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థులను డైరెక్టర్ పరసా భరత్, హెచ్‌ఎం పిచ్చిక సుబ్రహ్మణ్యం అభినందించారు.

ప్రశాంతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు



అక్కిశెట్టి ప్రసాద్, దాట్ల గోపిరాజు, బొక్కా నాగశివప్రసాద్, మేడిద సత్తిబాబు, సాధనాల నాగబాబు, గుర్రం శ్రీహరిరత్నప్రసాద్, సాగి వాసురాజు, రాయపురెడ్డి స్వామినాయుడు, చోడిశెట్టి నాగబాబు, చొల్లంగి సత్యనారాయణమూర్తి, మద్దాల తమ్మన్న, ఉచ్చుల కృపావరం, గుత్తుల శ్రీనివాస్, మోటూరి రవిశంకరకుమార్, నల్లా సత్యనారాయణ, దంగేటి చిట్టిబాబు

నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్ష, డైరెక్టర్ల పదవులకు ఎన్నికలు

అంబాజీపేట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): తహశీల్దారు జె.వెంకటేశ్వరి పర్యవేక్షణలో ఎన్నికల అధికారులు ఎంపీడీవో జీవీ సరోవరరావు, ఏవో సీహెచ్‌డీ విజయకుమార్, ఇరిగేషన్ డీఈఈ ఆర్.నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో కె.పెదపూడి, పసుపల్లి, ఇసుకపూడి సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. కె.పెదపూడి, పసుపల్లి, ఇసుకపూడి సాగునీటి సంఘాల చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యుల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. కె.పెదపూడి నీటి సంఘం చైర్మన్‌గా అక్కిశెట్టి వెంకట తిరుపతి శివప్రసాద్, వైస్‌చైర్మన్‌గా అంబటి నాగేశ్వ రరావు, ఇసుకపూడి నీటి సంఘం చైర్మన్‌గా కొలనాడ సత్యనారాయణరాజు, వైస్‌చైర్మన్‌గా పప్పుల సత్యనారాయణమూర్తి, పసుపల్లి నీటి సంఘం చైర్మన్‌గా నిమ్మకాయల వెంకటేశ్వరరావు, వైస్‌చైర్మన్‌గా నాగులపల్లి కొండలరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి ఆయా ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డైరక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ జల్లి బాలరాజు, దంతులూరి శ్రీనురాజు, అక్కిశెట్టి పెద్ద, సుంకర గణపతిరావు, రంకిరెడ్డి అబ్బి, అరిగెల సూరిబాబు, పెరుగు అంజి, అప్పన సుబ్బహ్మణ్యం పాల్గొన్నారు. అనంతరం ర్యాలీగా ఇంటికి వెళ్లారు.

అనాతవరం, ముమ్మిడివరం ఏకగ్రీవం

ముమ్మిడివరం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో అనాతవరం, ముమ్మిడివరం నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. అనాతవరం నీటిసంఘం అధ్యక్షుడిగా శీలం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా నగుబత్తుల పద్మనాభం ఎన్నికయ్యారు. వీరితో పాటు రేవు రంగారావు, కోలా మాణిక్యాలరావు, కైరం నాగేశ్వరరావు, గోకరకొండ శ్రీనివాసరావు, చప్పిడి వరప్రసాద్, చిలువూరి సత్యనారాయణరాజు, భీమవరపు పుష్పరత్నఅనసూయ, మేడిద జోగయ్య, యల్లమిల్లి మురళీబాబు, లంక బాలయోగి డైరెక్టర్లగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎంపీడీవో తాడి వెంకటాచార్యులు, బి.గోపాలకృష్ణ వ్యవహరించారు. అలాగే ముమ్మిడివరం నీటిసంఘం అధ్యక్షుడిగా సరిపెల్ల శ్రీనివాసరాజు, ఉపాధ్యక్షుడిగా బొబ్బిలి ఈశ్వరరావు ఎన్నికయ్యారు. డైరెక్టర్లగా వేటుకూరి శ్రీనివాసరాజు, పైబోడి వెంకటేశ్వరరావు, నూకల వెంకటసూర్యప్రకాష్, సానబోయిన భైరవమూర్తి, తొత్తరమూడి నాగేశ్వరరావు, తాడి వెంకటరమేష్‌బాబు, మట్టపర్తి నాగేశ్వరరావు, సానబోయిన శ్రీనివాసరావు, మీసాల వెంకటేశ్వరరావు, వేటుకూరి సుబ్రహ్మణ్యబాపిరాజు ఎన్నికయ్యారు.



అమలాపురం: గూడాల సాగునీటిసంఘ నూతన కార్యవర్గం

మూడూ ఏకగ్రీవం

పి.గన్నవరం, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. గంటిపెదపూడి ఎన్నిక సమయంలో కొన్ని గంటలు రాజకీయ హైడ్రామా జరిగినప్పటికి చివరి నిమిషంలో ఆ సంఘం కూడా ఏకగ్రీవమే అయ్యింది. పి.గన్నవరం అధ్యక్షుడిగా చొల్లంగి సత్తిబాబు(టీడీపీ), ఉపాధ్యక్షుడిగా మానేపల్లి వీరస్వామినాయుడు(జనసేన), మానేపల్లి అధ్యక్షుడిగా మాద్దాల తమ్మన్న (జనసేన), ఉపాధ్యక్షుడిగా గిడుగు రారాజు (టీడీపీ), గంటిపెదపూడి అధ్యక్షుడిగా ఉచ్చుల కృపావరం(జనసేన), ఉపాధ్యక్షుడిగా బొలిశెట్టి వీర్రాజు(టీడీపీ)గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గంటిపెదపూడి బీజేపీకి కేటాయించారు. కానీ చివరి నిమిషంలో జరిగిన రాజకీయ పరిణామా లతో జనసేనకు కేటాయించాల్సి వచ్చింది. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు టీడీపీ, నాలుగు జనసేన పార్టీలకు చెందిన అభ్యర్థులు నీటి సంఘాలను కైవసం చేసుకున్నాయి. తహశీల్దార్ పి.శ్రీపల్లవి, ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు, ఎంపీడీవో కేవీ ప్రసాద్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

ప్రశాంతంగా ఎన్నికలు

రాజోలు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాజోలు మండలంలో ఐదు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్ శనివారం తెలిపారు. పొన్నమండ నీటి సంఘం అధ్యక్షుడిగా గుబ్బల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా చేగొండి త్రిమూర్తులు, కడలి నీటి సంఘం అధ్యక్షుడిగా గాలిదేవర వెంకన్నబాబు, ఉపాధ్యక్షుడిగా ఆకుమర్తి వెంకటేశ్వరరావు, తాటిపాక నీటిసంఘం అధ్యక్షుడిగా కడలి కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడిగా చిత్రపు బాలకన్నన్‌కుమార్, రాజోలు నీటిసంఘం అధ్యక్షుడిగా పినిశెట్టి వెంకటస్వామి (బుజ్జి), ఉపాధ్యక్షుడిగా రామేశ్వరపు వెంకటప్రభాకరరావు, పొదలాల నీటిసంఘం అధ్యక్షుడిగా ఉలిశెట్టి లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడిగా గెద్దాడ వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు డైరెక్టర్లు కూడా ఎన్నికయ్యారని తహశీల్దార్ ప్రసాద్ తెలిపారు. నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కేతా శ్రీను, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, గెద్దం మహాలక్ష్మిప్రసాద్, సర్పంచ్‌లు గిడుగు బుజ్జి, కుక్కల బేబికుమారి, మాజీ ఉపసర్పంచ్ అడబాల సత్యరమేష్, ఉపసర్పంచ్ పామర్తి రమణ, రావి మురళీ, గుబ్బల కుమార్, కడలి వెంకటరమణారావు, కుంపట్ల చిన్నారి, అడబాల చంటి, కడలి కపిల్, ఇసకపల్లి బంగారం, కసుకుర్తి త్రినాథస్వామి, మెరుగుమువ్వల సత్యవరప్రసాద్, ఆరుమిల్లి భాను, కడలి మోహన్, సోమిశెట్టి ప్రకాష్ తదితరులు పాల్గొని అభినందించారు.

బాధ్యతగా పనిచేయాలి: జేసీ

అమలాపురం రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులతో పాటు ప్రజలకు సక్రమంగా తాగునీరు అందేలా సాగునీటి సంఘాల ప్రతినిధులు బాధ్యతగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సూచించారు. వన్నెచింతలపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రెడ్డిపల్లి సాగునీటి సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా తహశీల్దార్ జీడీ కిశోర్‌బాబు వ్యవహరించారు. ఎన్నికల నిర్వహణ తీరును జేసీ నిషాంతి పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. రెడ్డిపల్లి సాగునీటి సంఘానికి 12మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండారు సత్యసాయిఆదినారాయణ, ఉపాధ్యక్షుడిగా యాళ్ల వెంకటలక్ష్మీనరసింహారావు ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా సరిపెల్ల సుబ్బరాజు, గరిమెళ్ల సత్యనారాయణ, కొలిశెట్టి జయప్రకాష్‌నారాయణ, రేలంగి సూర్యనారాయణ, బళ్ల గిరిజా మల్లేశ్వరరావు, శీలం సత్తిరాజు, కరాటం వెంకటేశ్వరరావు, యాళ్ల జగదీశ్వరరావు, దాసరి బాలసుబ్రహ్మణ్యం, పాలూరి నారాయణస్వామిను ఎన్నుకున్నారు. కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు ఎన్నికల అధికారిగా గూడాల సాగునీటి సంఘ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా రాజులపూడి వెంకటేశ్వరరావు (భీముడు), ఉపాధ్యక్షుడిగా పంపిరెడ్డి కాశీవిశ్వేశ్వరరావును ఎన్నుకున్నారు. డైరెక్టర్లగా రంకిరెడ్డి నారాయణస్వామి, వంకాయల నారాయణరావు, పోలిశెట్టి భాస్కరరావు, నడింపల్లి లక్ష్మీపతిరాజు, కైరం స్వామినాయుడు, జంపన బుచ్చిరాజు, పోతాబత్తుల సూర్యనారాయణ, నక్కా సత్యనారాయణ, భూపతిరాజు వరలక్ష్మి, నడింపల్లి సూర్యనారాయణరాజును ఎన్నుకున్నారు. భీముడుతో సహా ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రత్యేకంగా అభినందించారు.



పోలిశెట్టి వెంకట ఉమామహేశ్వరరావు, ఆకుల వెంకటరమణ, బండారు వెంకటేశ్వరరావు, గుబ్బల శ్రీనివాస్, పినిశెట్టి వెంకటస్వామి, గాలిదేవర వెంకన్నబాబు, ఉలిశెట్టి లక్ష్మణరావు

ఐదు నీటి సంఘాలు ఏకగ్రీవం

అల్లవరం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఐదు నీటి సంఘాలకు 60ప్రాదేశిక నియోజకవర్గాలకు శనివారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని, అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తహశీల్దారు వీవీఎల్ నరసింహారావు తెలిపారు. కొమరగిరిపట్నం నీటి సంఘం అధ్యక్షుడిగా దాట్ల గోపిరాజు, ఉపాధ్యక్షుడిగా యర్రంశెట్టి నాగేశ్వరరావు, గోడిలంక నీటి సంఘం అధ్యక్షుడిగా బొక్కా నాగశివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా బండిగుప్తాపు వీరవెంకట సూర్యనారాయణ, దేవగుప్తం అధ్యక్షుడిగా మేడిద సత్తిబాబు, ఉపాధ్యక్షుడిగా కోలా, తాడికోన సంఘ అధ్యక్షుడిగా సాధనాల నాగబాబు, ఉపాధ్యక్షుడిగా అబ్బిరెడ్డి రంగబాబు, బెండమూర్లంక సంఘ అధ్యక్షుడిగా గుర్రం శ్రీహరిరత్నప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కడలి అచ్యుత రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు 1 చొప్పున సంఘం డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అమలాపురం రూరల్ పరిధిలోని గూడాల సంఘ అధ్యక్షుడిగా రాజులపూడి భీముడు, ఉపాధ్యక్షుడిగా పంపిరెడ్డి కాశీలు ఎన్నికయ్యారు. వీరిని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, వేగిరాజు వెంకట్రాజు, గుర్రం కృష్ణ, సాధనాల వెంకట్రావు, కంకిపాటి వీరబాబు, రుద్రరాజు కాశీరాజు తదితరులు అభినందించారు.

నీటి సంఘాల చైర్మన్లు వీరే

ఉప్పలగుప్తం, డిసెంబరు 14: మండలంలోని ఎనిమిది సాగునీటి వినియోగదారుల సంఘాలకు శనివారం ఏకగ్రీవంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించారు. అన్ని సంఘాలకు డైరెక్టర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఎన్.కొత్తపల్లి సంఘం చైర్మన్‌గా గుత్తుల శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా నడింపల్లి సూర్యనారాయణరాజు ఎన్నికయ్యారు. టి.చల్లపల్లి సంఘం చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా దంగేటి చిట్టిబాబు, సుంకర రాంబాబు, ఎస్.యానాంకు పోలిశెట్టి వెంకటఉమామహేశ్వరరావు, చవటపల్లి అర్జునరావు, గోపవరానికి ఆకుల వెంకటరమణ, కుంపట్ల వెంకన్నబాబు, గొల్లవిల్లికి నల్లా సత్యనారాయణ, చీకురుమెల్లి చక్రధరరావు, ఉప్పలగుప్తం సంఘానికి మోటూరి రవిశంకరకుమార్, దున్నాల ఆదినారాయణ, కిత్తనచెరువుకు బండారు వెంకటేశ్వరరావు, కంచుమర్తి రాజారావు, చినగాడవిల్లికి బండారు జగపతి రాజారావు, పినిశెట్టి వెంకటరెడ్డినాయుడు ఎన్నికయ్యారు.

మూడు నీటిసంఘాలు ఏకగ్రీవం

అంతర్వేది, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో నీటిసంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సఖినేటిపల్లి గీతామందిరం హైస్కూలు, గొందికి సంబంధించి రామేశ్వరం హైస్కూలు, అంతర్వేది హైస్కూల్‌లో మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతుల సమక్షంలో నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సఖినేటిపల్లి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా నామన నాగభూషణం, ఉపాధ్యక్షుడిగా దొంగ భాస్కరరావు, గొంది నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా ఆకన బాబ్జినాయుడు, ఉపాధ్యక్షుడిగా వీరా కర్ణుడు, అంతర్వేది నీటి వినియోగదారుల సంఘ అధ్యక్షుడిగా యెనుముల సింహాచలం, ఉపాధ్యక్షుడిగా గెడ్డం సువర్ణరాజు (బాల) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల్లో 12మంది ఎన్నిక కాగా వారిలో ఇద్దరిని అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా, మిగిలిన పదిమందిని టీసీ మెంబర్లుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి శ్రేణులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఎన్నికైన వారికి రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు.

ఏకగ్రీవంగా కూటమి కైవసం

అయినవిల్లి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. శనివారం అయినవిల్లి, నేదునూరు, శానపల్లిలంక నీటి సంఘాల ఎన్నికలను నిర్వహించారు. అయినవిల్లి నీటిసంఘం పరిధిలోని అయినవిల్లి, సిరిపల్లి, విలస, మాగాం, అమలాపురం పరిధిలోని వేమవరం, భట్నవిల్లి, శానపల్లిలంక నీటి సంఘం పరిధిలోని శానపల్లిలంక, తొత్తరమూడి, కె.జగన్నాథపురం, శంకరాయగూడెం, క్రాపచింతలపూడి, ఎస్.మూలపొలం, రాణేలంక, గేదెల్లంక, కొమానపల్లి, నేదునూరు నీటిసంఘం పరిధిలోని నేదునూరు, నల్లమిల్లి, బండారులంక, నీడిపూడి, చింతలపల్లి, సావరం డీసీలలో డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నీటి సంఘాల అధ్యక్షులు వీరే..

అయినవిల్లి నీటిసంఘం అధ్యక్షుడిగా కాకర శ్రీనివాస్, శానపల్లిలంక అధ్యక్షుడిగా గుద్దటి జమ్మి, నేదునూరు నీటిసంఘం అధ్యక్షుడిగా చింతలపల్లి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నీటి సంఘాల ఎన్నికలు

కాట్రేనికోన, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పల్లంకుర్రు నీటి సంఘానికి ఇసుకపట్ల వెంకటరమణ, కందికుప్పకు ఆకాశం శ్రీనివాస్, దొంతికుర్రుకు పిన్నమరాజు రంగరాజు, కాట్రేనికోనకు వాసంశెట్టి రాజేశ్వరరావు అధ్యక్షుడిగాఎన్నికయ్యారు.

నాలుగు సంఘాలు ఏకగ్రీవం

ఐ.పోలవరం, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి):నాలుగు నీటి సఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. పోలవరం నీటి సంఘం అధ్యక్షుడిగా రాయపురెడ్డి స్వామినాయుడు, ఉపాధ్యక్షుడిగా మట్టపర్తి చంద్రరావు, కేశనకుర్రు నీటి సంఘం అధ్యక్షుడిగా చిలువూరి సుబ్బరాజు, ఉపాధ్యక్షునిగా సత్తి శ్రీను ఎన్నికయ్యారు. టి.కొత్తపల్లి సంఘం అధ్యక్షుడిగా చోడిశెట్టి నాగబాబు, ఉపాధ్యక్షుడిగా అరవ వెంకటస్వామినాయుడు, గుత్తెనదీవి సంఘం అధ్యక్షుడిగా సాగి వాసురాజు, ఉపాధ్యక్షుడిగా గోదాశి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ప్రతి సంఘానికి 12 మంది డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.

మూడు సంఘాలు ఏకగ్రీవం

మలికిపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మలికిపురం, రామరాజులంక, లక్కవరం సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ఏకగ్రీవంగా జరిగాయి. మలికిపురం సంఘం అధ్యక్షుడిగా తిరుమల సుబ్బారావు, ఉపాధ్యక్షురాలిగా ఉంగరాల నాగవెంకటసూర్యవరలక్ష్మితో పాటు మరో పది మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి, తహశీల్దార్ టి.శ్రీనివాసరావు తెలిపారు. అదే విధంగా లక్కవరం నీటి సంఘం అధ్యక్షుడిగా రాపాక మల్లికార్జునరావు, ఉపాధ్యక్షునిగా కాపిశెట్టి కనకేశ్వరరావు ఎన్నికయ్యారు. రామరాజులంక నీటి సంఘం అధ్యక్షుడిగా ముద్దల సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా నల్లి జయరాజుతో పాటు పది మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎంపీడీవో, ఎన్నికల అధికారి ఎన్.బాలాజీ తెలిపారు. లక్కవరం నీటి సంఘం అధ్యక్షుడిగా రాపాక మల్లికార్జునరావు ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికలఅధికారి, మండల వ్యవసాయశాఖ అధికారిఎస్.రాకేష్ ప్రకటించారు.

గంటిపెదపూడి నీటిసంఘం ఎన్నికల్లో గందరగోళం

- ఎమ్మెల్యే సూచించిన అభ్యర్థికి చుక్కెదురు!
- ఆ అభ్యర్థి అయితే మేం ఒప్పుకోమంటూ భీష్మించిన రైతులు
- చివరి దశలో అభ్యర్థిని మార్పు చేసిన ఎమ్మెల్యే
- రైతులు సూచించిన వ్యక్తే టీసీగా ఏకగ్రీవంగా ఎన్నిక

పి.గన్నవరం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సూచించిన అభ్యర్థిని రైతులు వ్యతిరేకించారు. ఆ అభ్యర్థి అయితే మేం ఒప్పుకోమంటూ రైతులు భీష్మించుకుని కూర్చోవడంతో ఐదు గంటలు పాటు సాగిన రాజకీయ హైడ్రామాలో చివరికి రాజకీయాలు ముందు రైతే గెలిచాడు. గంటిపెదపూడి నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు ఉడిమూడి హైస్కూల్‌లో నిర్వహించారు. అయితే ఈనీటి సం ఘంలో పి.గన్నవరం మండలంతో పాటు రావులపాలెం, కొత్తపేట మండలాల్లో పలు గ్రామాలున్నాయి. ఎక్కువ భాగం పి.గన్నవరం నియోజకవర్గంలో ఉండటంతో అధ్యక్షుడి ఎంపిక బాధ్యతను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తీసుకున్నారు. ఈనీటి సంఘాన్ని బీజేపీకి కేటాయించి అధ్యక్షుడిగా బీజేపీ మండల అధ్యక్షుడు యర్రంశెట్టి సాయిబాబును ఎమ్మెల్యే సూచించారు. సాయిబాబు టీసీ నెం.6లో పోటీ చేసేందుకు సన్నద్ధమయ్యారు. అయితే సాయిబాబు అభ్యర్థిత్వాన్ని ఆ ప్రాంత రైతులతో పాటు పలువురు కూటమి నాయకులు వ్యతిరేకించారు. ఉదయం 9గంటలకు ఎన్నిక ప్రారం భం కావడంతో టీసీ నెం:6లో సాయిబాబుకు పోటీగా అదే గ్రామానికి చెందిన బోరుసు సూర్య వెంకటసత్యనారాయణ బరిలో ఉన్నారు. దీంతో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్థానిక నాయకు లతో మాట్లాడారు. అదే సమయంలో కొంత మంది రైతులు మాకు ఓట్లు లేవని, మృతి చెందిన వారికి ఓట్లు ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఓట్లు లేకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ఆరోపణలు చేస్తూ ఎన్ని కలను నిలిపి వేయాలని ఎంపీటీసీ పల్లి మోషే, అభ్యర్థి సాయిబాబు అధికారులను డిమాండ్ చేశారు. ఒక దశలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో సీఐ భీమరాజు, ఎస్ఐ బి.శివకృష్ణలు కల్పించుకుని నాయకులను అక్కడ నుంచి బయటకు పంపించి వేశారు. మమ్మల్ని కూర్చో బెట్టి ఎన్నిక ఎప్పుడు నిర్వహిస్తారని టీసీనెం.6 రైతులు అధికారులపై మండిపడ్డారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, నియోజకవర్గ ముఖ్యనాయకులు వచ్చి రైతులు, ఆ ప్రాంత నాయకులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. 4గంటలు సాగిన చర్చలు ఫలించకపోవడంతో ఎమ్మెల్యే సత్యనారాయణ సూచనతో టీసీ-6 అభ్యర్థి సాయిబాబు పోటీ నుంచి తప్పుకున్నారు. దీంతో రైతులు సూచించిన టీసీ-6 అభ్యర్థి బోరుసు సూర్య వెంకటసత్యనారాయణను రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో 12మంది టీసీలు ఏకగ్రీవం అయ్యాయి. అనంతరం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో అధ్యక్షుడిగా జనసేన నాయకుడు ఉచ్చుల కృపావరం, ఉపాధ్యక్షుడిగా గంటికి చెందిన టీడీపీ నాయకుడు బొలిశెట్టి వీర్రాజు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎంపీడీవో కేవీప్రసాద్ ధ్రువపత్రాలు అందించారు.



టీసీ-6 అభ్యర్థిగా ఎన్నికైన బోరుసు

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు

మామిడికుదురు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో అథ్లెటిక్స్ పోటీల్లో మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారని బాక్సింగ్ కోచ్ చిట్టూరి చంద్రశేఖర్ తెలిపారు. కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో గంధం పావనీసాయిమహా 21కిలోమీటర్ల మారథాన్‌లో బంగారు పతకం, చిట్టూరి సాయివరలక్ష్మి లైట్‌వెయిట్ బాక్సింగ్‌లో బంగారు పతకం, చిట్టూరి యోగితాకుమారి ఫ్లైవెయిట్ బాక్సింగ్ విభాగంలో రజత పతకాన్ని సాధించారన్నారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను కోచ్, పలువురుఅభినందించారు.

లోక్ అదాలత్‌లో 175 కేసులు రాజీ

ముమ్మిడివరం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల లీగల్ సర్వీసెస్ కమిటీ జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా ఆధ్వర్యంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. 175కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో 6ఈపీ కేసులకు సంబంధించి రూ.16.50లక్షలు, 8ఓన్ మనీ కేసులు సంబంధించి రూ.18.45లక్షలు, 3ఎంసీ కేసులకు రూ.3.25లక్షలు, 2 డీవీసీ కేసులు, 5ఎన్ఐ యాక్టు కేసులకు రూ.2.80లక్షలు, 43 ఐపీసీపీ కేసులకు రూ.3,01,000, 83 ఎక్సైజ్ కేసులకు రూ.4.20లక్షలు, 24బ్యాంకు పీఎల్‌సీ కేసులకు రూ.7.96లక్షలు, బెంచ్ కోర్టు ఐపీసీ సీసీ ఒక కేసు, మొత్తం 175 కేసులకు సంబంధించి రూ.56.17లక్షలు అపరాధ రుసుం వసూలు చేసినట్టు సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, కేఆర్కే రాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మహిళల నిరసన

మామిడికుదురు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ మొగలికుదురు హైస్కూలు ప్రాంతానికి చెందిన మహిళలు శనివారం నిరసన తెలిపారు. తాగునీరు అందడంలేదని, మానేపల్లి వాటర్ స్కీము ద్వారా తాగునీరు పంపిణీ పూర్తిస్థాయిలో జరగకపోవడం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. తాటిపాక గ్రామానికి చెందిన డ్రైన్ నీరు తమ గ్రామంలోకి వస్తుందని దీన్ని అరికట్టాలంటూ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌గుల పద్మావతి, చిక్కం స్వాతి, పితాని మారుతీ, చొల్లంగి స్వర్ణకుమారి, తోలేటి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు

అల్లు అర్జున్ అరెస్టు దారుణం

మామిడికుదురు, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ హీరో అల్లు అర్జున్ అరెస్టు దారుణమైనమని, ఉద్దేశ పూర్వకంగా అరెస్టు చేయించారని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అల్లు ఇంటి పేరు గల కుటుంబ సభ్యులు గోగన్నమఠంలో తీవ్రంగా ఖండించారు. సినీ పరిశ్రమలో ఎదుగుతున్న మనిషిని అణగదొక్కే ప్రయత్నాల్లో ఇది ఒకటన్నారు. రాజకీయ నాయకుల సమావేశాల్లో, ఉత్సవాల్లో జరిగిన తొక్కిసలాటల్లో ఎంత మందిని అరెస్టు చేశారని ప్రశ్నించారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు సంబంధిత శాఖవారు బాధ్యత వహించాలని, ఒక సెలబ్రిటీని, ప్రముఖ వ్యక్తులను అరెస్టు చేసే సమయంలో ఆలోచన చేయాలని వారు కోరారు. అల్లు రాధాకృష్ణ, అల్లు సురేష్, అల్లు రామకృష్ణ, అల్లు ప్రసాద్, అల్లు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

16న జాబ్‌మేళా

ముమ్మిడివరం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ముమ్మిడివరం నియోజకవర్గానికి సంబంధించి డిసెంబరు 16న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు శనివారం తెలిపారు. జాబ్‌మేళాలో మూడు కంపెనీల్లో సుమారు 200కు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, డిప్లమో, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, పీజీ చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఇంటర్వ్యూకు బయోడేటా, ఆధార్, ఐడీ అడ్రస్ ప్రూఫ్, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు శ్రీదేవి సెల్: 8341648470, రాజేంద్ర సెల్: 8247645389లలో సంప్రదించాలన్నారు.

యానాం విజన్‌డాక్యుమెంట్ అవసరం: జీఎన్ నాయుడు

యానాం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): యానాంలో దీర్ఘకాలిక ప్రయోజనాలకోసం ఒక విజన్ డాక్యుమెంట్ తయారుచేయవలసిన అవసరముందని రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 1985లో పుదుచ్చేరికి అప్పటి లెఫ్టినెంట్ గవర్నర్ కొన ప్రభాకరరావు, ముఖ్యమంత్రి ఫారుఖ్‌లతో పాటు ఏపీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావులను సంప్రదించడంతో సానుకూలంగా స్పందించి రీజెన్సీ సంస్థకు ప్రారంభ సమయంలో ఈక్విటీ షేర్ రూపంలో ఏపీఐడీసీ ద్వారా ఆర్థిక సహాయం అందించారన్నారు. తెలుగు ప్రజలను దృష్టిలో ఉంచుకుని వారి అభివృద్ధికి ప్రస్తుత గవర్నర్ కైలాస్‌నాథ్, ముఖ్యమంత్రి రంగసామి, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలతో యానాం ప్రాంత అభివృద్ధి పనుల గురించి ఒక కార్యాచరణను రూపొందించాలన్నారు. చంద్రబాబు రూపొందించిన స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌కు మంచి గుర్తింపు వచ్చిందని, యానాం దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం విజన్ డాక్యుమెంట్ తయారుచేయవలసిన అవసరముందన్నారు.

లోక రక్షకుడిని స్మరిస్తూ యూత్ క్రిస్మస్ వేడుకలు

అమలాపురం టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, కరుణ, దయలకు ప్రతిరూపంగా ఏసుక్రీస్తు భూమిపై మానవ రూపంలో జన్మించారని అమలాపురం మన్నా జూబ్లీ చర్చి వ్యవస్థాపకుడు రెవ.కార్ల్‌డేవిడ్ కొమానపల్లి, షారోన్ రోజ్ పేర్కొన్నారు. యూత్ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా అమలాపురం నల్లవంతెన దిగువన ఉన్న మన్నా జూబ్లీ చర్చిని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. లైటింగ్ సెట్టింగులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శనివారం ఎస్తేరుజ్యోతి తాతపూడి, ఎర్నెస్ట్ తాతపూడి యూత్ క్రిస్మస్ సందేశం అందించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ముమ్మిడివరం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం విష్ణాలయం సెంటర్‌లోని బేకరీలో పనిచేస్తున్న ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. బెంగళూరుకు చెందిన చేతన్‌గౌడ్(19) కొన్నేళ్లుగా ముమ్మిడివరం విష్ణాలయం సెంటర్‌లోని బేకరీలో పనిచేస్తున్నాడు. తాను ఉంటున్న గదిలో శుక్రవారం రాత్రి పడుకున్న చేతన్‌గౌడ్ ఉదయం లేవకపోవడంతో అతడిని లేపేందుకు అతడితో కలిసి ఉంటున్న యువకులు ప్రయత్నించగా అతను లేవకపోవడంతో విషయాన్ని యజమాని శరత్‌కు తెలియచేయడంతో ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి మృతదేహాన్ని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఒత్తిడి తట్టుకోలేక మంగాదేవి మృతి

డ్వాక్రా యానిమేటర్ల ఆరోపణ

కాట్రేనికోన, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో వీవోఏగా విధులు నిర్వహిస్తున్న డెక్కల మంగాదేవి శనివారం గుండె పోటుతో మృతి చెందింది. ఆమె మృతికి శ్రీనిధి ఏజీఎం దాట్ల లక్ష్మీప్రసన్నకుమారి కారణమంటూ డ్వాక్రా యానిమేటర్లు ఆరోపించారు. అవినీతికి పాల్పడిందని, రూ.69వేలు తక్షణం చెల్లించాలని ఏజీఎం వత్తిడి చెయ్యడం వల్లే మంగాదేవి మరణించిందని వ్యాఖ్యానించారు. అధికారులు ఈవిషయంపై స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు పొట్టి శ్రీరాములు వర్ధంతి

అమలాపురం టౌన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య పేర్కొన్నారు. అమలాపురం విష్ణుశ్రీ గ్రాండ్ ఫంక్షన్ హాలులో శనివారం జరిగిన సమావేశంలో ఉభయ తెలుగు రాష్ట్రాల సమైక్య భారతి గౌరవాధ్యక్షుడు నల్లా పవన్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సమైక్య భారతి, పశ్చిమబెంగాల్ తెలుగుజాతి ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరు వాసురావు, గురజాడ అప్పారావు మునిమనుమడు ఎం.విజయ్‌గోపాల్, ప్రముఖ వైద్య నిపుణుడు గోదశి గంగరాజు, హిందీ శాఖాధిపతి నల్లా సత్యనారాయణ, గిడుగు రామమూర్తి పంతులు మునిమనుమడు గిడుగు నాగేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు.

లోక్ అదాలత్‌లో 71 కేసులు పరిష్కారం

రాజోలు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాజోలు కోర్టు కాంప్లెక్సు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఎంఎల్ఎస్‌సీ కమిటీ చైర్మన్ రాజోలు సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి మాట్లాడుతూ 71కేసులకు రూ.77,82,748 ఆర్థిక లావాదేవీలు పరిష్కారమయ్యాయన్నారు. 12సివిల్‌కేసులకు రూ.75.15లక్షలు, బీఎస్ఎన్ఎల్ 15కేసులకు రూ.10,748, బ్యాంకుకు సంబంధించి 11కేసులకురూ.2.67లక్షలు, 37క్రిమినల్ కేసులు పరిష్కారమయ్యాయని జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు తెలిపారు. రాజీ చేసుకుంటే ఆ కేసు ఏ ఇతర న్యాయస్థానాల్లో అప్పీలు చేసినా చెల్లుబాటు కాదన్నారు.

31 కేసులు పరిష్కారం

యానాం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలోని సబ్‌కోర్టులో తాలుకా లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో 31కేసులు పరిష్కరించినట్టు కమిటీ చైర్మన్, న్యాయమూర్తి రాజమోహన్ తెలిపారు. శనివారం స్థానిక కామిశెట్టివారి వీధిలోని యానాం సబ్‌కోర్టు ఆవరణలో లోక్‌అదాలత్ నిర్వహించారు. 31కేసులకు రూ.27.90లక్షలు పరిష్కారమయ్యాయన్నారు.

ఆసుపత్రిలో పాము హల్‌చల్

కాట్రేనికోన, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన కార్తికేయ ఆసుపత్రిలో శనివారం ఒక గోధుమత్రాచు హల్‌చల్ చేసింది. ఆసుపత్రి సిబ్బందితో పాటు స్థానికులు ఆందోళనకు గురయ్యారు. భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ పామును పట్టుకుని సురక్షితప్రాంతంలో వదిలిపెట్టారు.

బాలబాలాజీ సన్నిధిలో ధనుర్మాస ఉత్సవాలు

మామిడికుదురు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో ఈనెల16వ తేదీ సోమవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. నెల రోజులు నిర్వహించే ఉత్సవాల్లో స్వామివారి సన్నిధిలో వేంచేసి ఉన్న అండాళ్‌తాయారు(గోదాదేవి) ధనుర్మాస దీక్ష స్వీకరిస్తారన్నారు. సోమవారం ఉదయం అర్చకులు మేళతాళాలతో తీర్థపు బిందెలతో గ్రామోత్సవం నిర్వహిస్తారని అండాళ్ తాయారు వారికి తిరుప్పావై సేవ జరుగుతుందని తెలిపారు. జనవరి 10వతేదీ ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని ఉదయం నుంచి స్వామివారు వైకుంఠ ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిస్తారని, ఆరోజు అండాళ్ తాయారుకు లక్ష చామంతి పూజ జరుగుతుందన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకోవాలి

ముమ్మిడివరం, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకోవాలని జిల్లా ఉపవిద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాష్ సూచించారు. అయినాపురం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో సెల్ఫ్ ఎసైన్‌మెంట్ టర్మ్-1 పరీక్షల తీరును ఆయన పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మమేకమయ్యారు. ఉన్నతమైన లక్ష్య సాధనకు శ్రమించడమే నిజమైన జీవితమని, ఉన్నత స్థానానికి చేరుకోవడమే జీవిత లక్ష్యమన్నారు. ఉపాధ్యాయులందరినీ సమావేశపరిచి అత్యుత్తమ ఫలితాలు కోసం వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు పరచడంలో సూచనలిచ్చారు. హెచ్‌ఎం టీవీ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండపేట



రావులపాలెంలో ఎఫెక్స్, హెస్తటిక్ హాస్పటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఎఫెక్స్, హెస్తటిక్ హాస్పిటల్ ప్రారంభం

రావులపాలెం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని రింగ్‌రోడ్డు సమీపంలో ఉన్న విక్టరీ బజార్ పైన ఎఫెక్స్, హెస్తటిక్ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ అధినేత డాక్టర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభోత్సవం చేశారు. ముఖ్య అతిథిగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, విక్టరీ బజార్స్ అధినేత గొలుగూరి వెంకటరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, తాడి నాగమోహన్‌రెడ్డి, మేడపాటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మందపల్లి ఆలయంలో భక్తుల తాకిడి

కొత్తపేట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామి ఆలయానికి శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వేకువజాము నుంచే స్వామివారి సర్వ దర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయంలో ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు సతీమణి రమాదేవి స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ చైర్మన్ సిద్దంశెట్టి వీరవెంకట సత్యనారాయణ ఆమెకు స్వామివారి చిత్రపటం అందించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి ఒకరోజు ఆదాయం రూ.1,69,192 వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



రమాదేవికి స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న మాజీ చైర్మన్ సిద్దంశెట్టి



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్

తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని నిలిపిన ఎన్టీఆర్

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి ఆత్మ గౌరవాన్ని నిలిపిన దివంగత నందమూరి తారకరామారావు భావితరాలకు ఆదర్శనీయుడని మంత్రి సుభాష్ అన్నారు. శనివారం ఎన్టీఆర్ చలనచిత్ర రంగంలో ప్రవేశించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రామచంద్రపురంలో వజ్రోత్సవాలను జరిపారు. స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి మంత్రి నివాళులర్పించారు. తెలుగుజాతి ఉన్నంత వరకు ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో ఉంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసంశెట్టి సత్యం, మేడిశెట్టి శేషారావు, అల్లూరి దొరబాబు, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో 100 పడకల ఆసుపత్రి పూర్తికి కృషి

మండపేట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి కేవలం 30 పడకల ఆసుపత్రికి మాత్రమే నిధులు, అనుమతులు విడుదలైన నేపథ్యంలో ఆసుపత్రిస్థాయి పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. మండపేటలో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి భవనం పనులను శనివారం వారు పరిశీలించారు. ప్రస్తుతం ఆసుపత్రి నిర్మాణానికి నిధుల కొరత ఉందని తన రాజ్యసభ నిధుల నుంచి రూ.50 లక్షలు ఇస్తానని, మరికొంత నగదును మున్సిపాల్టీ నుంచి ఇవ్వాలని బోస్ కోరారు. ఆసుపత్రిస్థాయి పెంపు, వసతుల కల్పనకు మరో రూ.15 కోట్ల నిధులు అవసరమని వాటిని ప్రభుత్వం నుంచి తీసుకువచ్చే బాధ్యత తాను తీసుకుని 100 పడకల ఆసుపత్రి పూర్తి చేసేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ప్రస్తుతం నూతన ఆసుపత్రి 30 పడకలు పూర్తిచేసి ఆసుపత్రి పనిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, వైసీపీ నేతలు, వేగుళ్ల పట్టాభి రామయ్యచౌదరి తదితరులు వున్నారు.



ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలిస్తున్న ఎంపీ బోస్, ఎమ్మెల్యే వేగుళ్ల



గుమ్మిలేరులో పుంగనూరు ఆవుదూడను చిన్నారులకు చూపిస్తున్న దృశ్యం

దేశవాళీ ఆవులపై చిన్నారులకు అవగాహన

ఆలమూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు దేశవాళీ ఆవులపై అవగాహన కల్పించేందుకు మండపేట యాపిల్ స్కూల్ యాజమాన్యం వినూత్న ప్రయత్నం చేసింది. పుంగనూరు ఆవుల పెంపకంలో గుర్తింపు పొందిన ఆలమూరు మండలం గుమ్మిలేరు రైతు రెడ్డి సత్తిబాబు మకాంలోని పుంగనూరు ఆవులతోపాటు దేశవాళీ ఆవులను చిన్నారులకు వారు చూపించారు. ఇటీవల రికార్డు స్థాయి తక్కువ ఎత్తులో పుట్టిన పుంగనూరు ఆవుదూడను చిన్నారులు ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడంతోపాటు స్థానిక సమస్యలు, దేశ సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయాలన్న లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు స్కూల్ యాజమాన్యం తెలిపింది.

వైభవంగా గో, వృషభ కల్యాణం



పెదపళ్లలో గో, వృషభ కల్యాణం దృశ్యం

ఆలమూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): లోకక్షేమం, పశుసంపద వృద్ధికి జరిగే గో, వృషభ కల్యాణాన్ని కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్లలో శనివారం వైభవంగా జరిపారు. వృషభం తరఫున పెదపళ్ల గ్రామానికి చెందిన ఉండమట్ల రాంబాబు వెంకటపద్మావతి దంపతులు, గోవు తరఫున రామచంద్రపురం మండలం చెల్లూరుకు చెందిన మాగాపు శ్రీనివాస్, అగ్నిజ్యోతి దంపతులు తల్లిదండ్రులుగా వ్యవహరించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య రుత్వికులు కల్యాణాన్ని జరిపారు. ఆవుకు, ఎద్దుకు మంగళస్నానాలు చేయించి పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెగా అలంకరించి బాసికాలు కట్టి ఉదయం 8.03 గంటలకు జీలకర్ర బెల్లం పెట్టించారు. అనంతరం మంగళవాయిద్యాలు, పండితుల మంత్రోచ్చారణల మధ్య తాళి కట్టించి తలంబ్రాల కార్యక్రమం జరిపారు. తదుపరి వృషభానికి శంఖు, చక్రం అచ్చు వేసి గ్రామంలో వదిలిపెట్టారు.

పీఠంలో నేడు పౌర్ణమి పూజలు

రాయవరం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆదివారం మార్గశిర పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి పలు ద్రవ్యాలతో అభిషేకాలు, విజయ వేంకటేశ్వరస్వామికి తులసిదళ అర్చనలు, భవాని సమేత అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం విజయదుర్గా అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు.

చిన్నారులకు బేబికేర్స్ అందజేత

మండపేట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండపేటలో వున్న ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో 1977లో చదువుకున్న పూర్వపు విద్యార్థులు శనివారం 70 మంది చిన్నారులకు బేబి కిట్స్‌ను అందించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద వున్న అర్బన్ ఆరోగ్య కేంద్రంలో వీటిని పంపిణీ చేశారు.



ఆలమూరు మండలంలో సాగునీటి సంఘాల అధ్యక్షులుగా ఎన్నికైన గారపాటి శ్రీనివాస్, వైట్ల గంగరాజు, మెర్ల గోపాలస్వామి, శివప్రసాద్



కె.గంగవరం: యండగండి నీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, కూళ్ల అధ్యక్షుడు చిట్టిబాబు, గంగవరం అధ్యక్షుడు లోవరాజు, దంగేరు అధ్యక్షుడు సతీష్, యర్రపోతవరం అధ్యక్షుడు వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు చౌదరి, కోట అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతం

ఆలమూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ఏకగ్రీవంగా జరిగాయి. చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా గారపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా వడ్డి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చొప్పెల్ల సాగునీటి సంఘం అధ్యక్షుడిగా మెర్ల గోపాలస్వామి, ఉపాధ్యక్షుడిగా పాలచర్ల సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఆలమూరు సాగునీటి సంఘానికి అధ్యక్షుడిగా వైట్ల గంగరాజు, ఉపాధ్యక్షుడిగా శీలం వెంకటరమణ ఎన్నికయ్యారు. మడికి సాగునీటి సంఘం అధ్యక్షుడిగా చెల్లుబోయిన శివప్రసాద్, ఉధ్యక్షుడిగా తమ్మన సూర్యచంద్రం ఎన్నికయ్యారు.



మండపేటలో సాగునీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, జనసేన ఇన్‌చార్జి లీలాకృష్ణ, కూటమి నేతలు

ఆరు నీటి సంఘాలు కూటమి కైవసం

కె.గంగవరం: మండలంలో ఆరు నీటి సంఘాల ఎన్నికల ప్రశాంతంగా జరిగాయి. ఆరుచోట్ల కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా విజయం సాధించారు. యండగండి నీటి సంఘం అధ్యక్షుడిగా అడపా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా టేకిమూడి సత్యనారాయణ, కూళ్ల నీటి సంఘం అధ్యక్షుడిగా ఎనుముల గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా చిట్టూరి సుబ్రహ్మణ్యం, గంగవరం నీటి సంఘం అధ్యక్షుడిగా తాడాల లోవరాజు, ఉపాధ్యక్షుడిగా నేమాని రామకృష్ణ శ్రీనివాస్, కోట నీటి సంఘం అధ్యక్షుడిగా ములకల విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా గోదావరి వీవీ నాగేశ్వరరావు, దంగేరు నీటి సంఘం అధ్యక్షుడిగా గోపు సతీష్, ఉపాధ్యక్షుడిగా ఓబిళినేని శ్రీనివాస్, యర్రపోతవరం నీటి సంఘం అధ్యక్షుడిగా నిడదవోలు వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావుచౌదరి, ఉపాధ్యక్షుడిగా నీల రాజ రాజేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఎంపీడీవో ఎన్.శ్రీనివాసు, తహశీల్దార్ బండి మృత్యుంజయరావు, ఇరిగేషన్ డీఈ పోచారావు, సింగం రవికుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి బలుసు రవి, డీఈ ఎం.అప్పారావు వ్యవహరించారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు మరివాడ సూరిబాబు, నున్న బుజ్జి, తోట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెం నీటి సంఘ అధ్యక్షులు చిన్న కేవీ, డైరెక్టర్లు



కపిలేశ్వరపురం మండలం కాలేరులో ఏకగ్రీవంగా ఎన్నికైన సాగునీటి వినియోగదారుల సంఘం

కొత్తపేట, అవిడి ఏకగ్రీవం

కొత్తపేట: మండలానికి సంబంధించి అవిడి, కొత్తపేట రెండు సంఘాలకు శనివారం కొత్తపేట నీటి సంఘం ఎన్నికలు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోను, అవిడి నీటి సంఘం ఎన్నికలు చప్పిడివారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలోను ఎన్నికల అధికారి ఎంవీ రామారావు పర్యవేక్షణలో జరిపారు. కొత్తపేట, అవిడి నీటి సంఘం ఎన్నికలు రెండూ ఏకగ్రీవం కాగా కొత్తపేట నీటి సంఘం అధ్యక్షుడిగా బండారు వీరరాఘవులు, ఉపాధ్యక్షుడిగా చోడే రామకృష్ణలతో పాటు 10 డైరక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తపేట నీటి సంఘం అధ్యక్షుడిగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అవిడి నీటి సంఘం అధ్య క్షుడిగా రెడ్డి రుషికేష్ మహేష్, ఉపాధ్యక్షురాలిగా శింగంశెట్టి దుర్గాభవానితో పాటు 10 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అవిడి మాజీ సర్పంచ్ రెడ్డి తాతాజీ రెండోసారి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. వీరిని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాస్, ముత్యాల బాబ్జి, బూసి జయలక్ష్మి తదితరులు అభినందించారు.

ప్రభుత్వ ఖాతాలోకి...

మండపేట: మండలంలో వున్న నాలుగు నీటి సంఘాలు ప్రభుత్వ ఖాతాలో చేరాయి. మండపేట సాగునీటి సంఘం అధ్యక్షుడిగా పసల శ్రీనివాసరావు, ముత్యాల సత్యనారాయణ మారే డుబాక, మండపేట మండలం ఏడిద సాగునీటి సంఘం అధ్యక్షుడిగా కోలుపోటి సత్యనారాయణ మూర్తి, ఉపాధ్యక్షుడిగా తాపేశ్వరానికి చెందిన ముత్యాల పట్టాభిరామయ్య చౌదరితోపాటు మరో పది మంది సభ్యులు ఎన్నికయ్యారు. పాలతోడు సాగునీటి సంఘ అధ్యక్షుడిగా బి.నాగేశ్వరరావు (వెలగతోడు) ఉపాధ్యక్షుడిగా యారమాటి శ్రీను (ఇప్పనపాడు) సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. కేశవరం పెద్దచెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడుగా అనదాసు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా పురంశెట్టి శ్రీనువాస్ తోపాటు మరో నలుగురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిని కూటమి నేతలతో పాటు స్థానిక నాయకులు అభినందించారు. సాగునీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులను రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వి.లీలాకృష్ణ, మండపేట మాజీ మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, అభినందించారు. నూతన సంఘాల అధ్యక్షులు, సభ్యులు శనివారం మండపేట టీడీపీ కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే వేగుళ్ల, లీలాకృష్ణ, చుండ్రు శ్రీవరప్రకాష్‌లను కలిశారు. వారందరినీ నాయకులు అభినందించారు.



రామచంద్రపురంలో సురేష్, సాయిరాం, పక్క చిత్రంలో ఎన్నికల ధ్రువీకరణ అందుకుంటున్న జగన్నాథరావు



రావులపాలెం: మండలంలో నీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. రావులపాలెం నీటి సంఘానికి సంబంధించి అధ్యక్షుడిగా చిన్న కేవీ, ఉపాధ్యక్షుడిగా జక్కంపూడి నాగేశ్వరరావు, గోపాలపురం సంఘ అధ్యక్షురాలిగా మైగాపుల పుష్పావతి, ఉపాధ్యక్షుడిగా భూపతిరాజు రామరాజు, లక్ష్మీపోలవరం సంఘ అధ్యక్షుడిగా యర్రంశెట్టి రాము, ఉపాధ్యక్షుడిగా కడలి వీర వెంకట సత్యనారాయణ, దేవరపల్లి అధ్యక్షుడిగా చవల జగన్నాధం, ఉపాధ్యక్షుడిగా కడలి శ్రీనివాసరావులతో పాటు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధికారులు తెలిపారు.

5 సాగునీటి సంఘాలు ఏకగ్రీవం

కపిలేశ్వరపురం: మండలంలో శనివారం జరి గిన సాగునీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో కాలేరు, వల్లూరు, మాచర, అంగర, తాతపూడి గ్రామాల్లో 5 సాగునీటి సంఘాలు ఏకగ్రీవమైనట్టు తహశీల్దార్ పి. చిన్నారావు తెలిపారు. కాలేరు నీటి సంఘం అధ్యక్షుడిగా గుణ్ణం సత్యనారాయణ మూర్తి, ఉపా ధ్యక్షుడిగా గుత్తుల పుత్రయ్య, వల్లూరు నీటి సంఘం అధ్యక్షుడిగా కాకర్ల శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షుడిగా నలుమూరి సింహాచలం, మాచర నీటి సంఘం అధ్యక్షుడిగా కొరపాటి జానకిరామయ్య, ఉపాధ్యక్షుడిగా సలాది సీతారాంబాబు, అంగర నీటి సంఘం అధ్యక్షుడిగా కొమ్మిశెట్టి నాగసూరిబాబు, ఉపాధ్యక్షుడిగా చోడే గోవిందరాజు, తాతపూడి నీటి సంఘం అధ్యక్షుడిగా మేకా శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా చుండ్రు భవ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మూడు సాగునీటి సంఘాలు ఏకగ్రీవం

రాయవరం: మండలంలోని కూర్మాపురం, చెల్లూరు, పసలపూడి సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ఏకగ్రీవమయ్యాయి. పసలపూడి నీటి సంఘం అధ్యక్షుడిగా నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా శాకా కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చెల్లూరు నీటి సంఘం అధ్యక్షుడిగా బలుసు వీర వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా రిమ్మలపూడి వీర వెంకట సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కూర్మాపురం నీటి సంఘం అధ్యక్షుడిగా కొరిపెల్ల వెంకట సత్య శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా చుండ్రు గోవిందరాజు ఎన్నికయ్యారు. తొలుత మండలంలోని మూడు నీటి సంఘాల పరిధిలో ఒక్కొక్క సంఘం తరఫున 12 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికకాగా ఎన్నికైన డైరెక్టర్లు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. మండలంలోని కూటమి తరపున ఏకగ్రీవంగా ఎన్నికైన డైరెక్టర్లను రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే వీవీవీ చౌదరి తదితరులు అభినందించారు.

ఆత్రేయపురం: మండలంలోని నాలుగు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు శనివారం విజయవంతంగా జరిపారు. అంకంపాలెం నీటి సంఘం అధ్యక్షుడిగా కరుటూరి నరసింహారావు, ఉపాధ్యక్షుడిగా బందెల శ్రీనివాస్, వద్దిపర్రు సంఘం అధ్యక్షుడిగా జుజ్జవరపు శ్రీహరి, ఉపాధ్యక్షురాలిగా వంకా మహాలక్ష్మి, ఆత్రేయపురం సంఘం అధ్యక్షుడిగా తోటకూర సత్తిరాజు, ఉపాధ్యక్షుడిగా వేగేశ్న కాశీ విశ్వనాధరాజు, మెర్లపాలెం సంఘం అధ్యక్షుడిగా కల్లూరి పుత్రసాయిరామ్, ఉపాధ్యక్షుడిగా ఆకుల శివశంకర్లు ఎన్నుకున్నట్లు అధికారులు ధృవీకరించారు.



రాయవరం: పసలపూడి అధ్యక్షుడిగా సత్యనారాయణ రెడ్డి, చెల్లూరు వీరవెంకట సత్యనారాయణ, కూర్మాపురం వెంకట సత్యశ్రీనివాసరావు

ద్రాక్షారామ: రామచంద్రపురం మండలం, పట్టణంలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. రామచంద్రపురం మండలం వెల్ల నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా చిగురుపాటి సాయిరాం, ఉపాధ్యక్షుడిగా కొమ్మిరెడ్డి రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వెలంపాలెం నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా వల్లూరి సురేష్, ఉపాధ్యక్షుడిగా గాదె సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వేగాయమ్మపేట నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా గారపాటి సూర్య సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా బోండా గంగాధరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తెలిపారు. తోటపేట నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా వనుమురెడ్డి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా పిచ్చుక వీర్రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రామచంద్రపురం నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా బిక్కిన జగన్నాధరావు, ఉపాధ్యక్షుడిగా పంపన శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, తహశీల్దార్ ఎం.సావిత్రి తెలిపారు. కరప మండలం సిరిపురం నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా రామచంద్రపురం మండలం నరసాపురపుపేటకు చెందిన మీనవల్లి సత్యనారాయణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



కొత్తపేట: అవిడి నీటి సంఘంలో ఎన్నికైన సభ్యులు





ఆత్రేయపురం మండలం అంకంపాలెం నీటి సంఘం అధ్యక్షుడిగా కరుటూరి నరసింహారావు, డీసీ సభ్యులు. పక్క చిత్రంలో ఆత్రేయపురం మండలం వద్దిపర్రు నీటి సంఘం అధ్యక్షుడిగా జుజ్జవరపు హరిబాబు, డీసీ సభ్యులు

విద్యార్థుల రక్తదానం

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం అంబికపల్లి అగ్రహారం రాజరత్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల, ఫార్మా విద్యార్థులు శనివారం 55 మంది రక్తదానం చేశారు. ఏరియా ఆసుపత్రి బ్లడ్‌బ్యాంకు వద్ద నిర్వహించిన రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు తొగరుమూర్తి ఆధ్వర్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు చే నిర్వహించిన రక్తదాన శిబిరంలో విద్యార్థుల రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు సిబ్బంది, కాకినాడ శ్రీయువసేన బ్లడ్ బ్యాంకు సిబ్బంది, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టరు కె.రామారావు, ఏవో ఎఎన్‌వి రవిధర్, హెచ్‌డీఎఫ్‌సీ మేనేజరు జి.శ్రీనివాస్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభలు

కపిలేశ్వరపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమరఖండ్రిక, వాకతిప్ప గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద శనివారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభలు జరిపారు. ఎస్ఆర్‌పీ ఇ.కనకారావు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు తిరునాతి ఆదిలక్ష్మి, కొరిపెల్ల నాగ వెంకట స్రవంతి అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి. ఈ సంద ర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డీఆర్పీలు వి.సువర్ణరాజు, ఎస్. గోపిలు గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలో సేకరించిన పనుల వివరాలు తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ పి.శేషారత్నం, ఎన్ఆర్ఈజీఎస్ జేఈ పి.రజితసింగ్, టెక్నికల్ అసిస్టెంట్ జె.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



వాకతిప్ప గ్రామసభలో పనుల వివరాలు తెలుపుతున్న డీఆర్పీ గోపి

ఉచిత వైద్య శిబిరం

ఆత్రేయపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో శనివారం ఉచిత ఎముకలు, కీళ్ల వైద్య సేవా శిబిరం జరిపారు. రావులపాలెం ప్రగతి నర్సింగ్ హోమ్ వైద్యుడు కర్రి సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 80 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో చెవి, ముక్కు, గొంతు వైద్యుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి పలు సేవలు అందించారు.

ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ పేదలకు భరోసా



ప్రగతి నర్సింగ్‌హోంలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీతో పేదలకు భరోసా కల్గిస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం ప్రగతి నర్సింగ్‌హోమ్‌లో శనివారం ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవల ప్రారంభోత్సవాన్ని డాక్టర్లు కర్రి బలరామరెడ్డి, కర్రి అనంత లక్ష్మి, కర్రి సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలతో పేదలకు మేలు జరుగుతుందన్నారు. ఖర్చు లేకుండా ప్రైవేట్ ఆసుపత్రుల్లో కార్పొరేట్ వైద్యం పొందేందుకు దోహదపడుతుందన్నారు. రావులపాలెంలోని ప్రగతి నర్సింగ్ హోమ్‌కు ఆరోగ్యశ్రీ సేవలు రావడం శుభపరిణామమన్నారు. ముప్పై ఏళ్లుగా వైద్యాధికారులు కర్రి బలరామరెడ్డి, అనంతలక్ష్మి దంపతులు ప్రజలకు వైద్య సేవలందించడం జరుగుతుందన్నారు. వారి తనయుడు ఆర్థోపెడిక్ వైద్యుడు కర్రి సందీప్‌రెడ్డి అనతికాలంలోనే హస్తవాసి ఉన్న వైద్యుడిగా గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చిలువూరి సతీష్‌రాజు, గుత్తుల పట్టాభిరామారావు, నందం వీరవెంకట సత్యనారాయణ, జక్కంపూడి వెంకటస్వామి, కోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నాయకులకు సందీప్ రెడ్డి సత్కరించి జ్ఞాపికలను అందించారు.